


# విజయభాను




విశాఖపట్నం, మంగళవారం 20-06-2023 VIJAYABHANU DAILY * VISAKHAPATNAM సంపుటి : 47 సంచిక : 231 పేజీలు : 08 వెల : 1 రూపాయి

## అవన్నీ నకిలీ ఓట్లు కాబట్టే ఎవరూ ఫిర్యాదు చేయలేదు

### ఏపీ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (సీఈవో) ముకేష్ కుమార్ మీనా




అమరావతి, (విజయభాను న్యూస్) : ఆంధ్రప్రదేశ్‌లో పది లక్షల నకిలీ ఓట్లను తొలగిస్తే ఒక్క ఫిర్యాదూ రాలేదని ఏపీ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (సీఈవో) ముకేష్ కుమార్ మీనా వెల్లడించారు. అవన్నీ డూప్లికేట్ ఓట్లు కాబట్టే ఎవరూ ఫిర్యాదు చేసేందుకు ముందుకు రాలేదన్నారు. రాష్ట్రంలో ఎన్నికలు రానున్న తరుణంలో అన్ని జాగ్రత్తలూ తీసుకుంటున్నట్లు చెప్పారు. ఓటరు కార్డుకు ఆధార్ కార్డును ఇంకా జత చేయలేదని.. కేవలం ఆధార్ సమాచారం మాత్రమే తీసుకుంటున్నామని ఆయన స్పష్టం చేశారు. "ప్రతీ ఏడాది ఓటర్ల జాబితా ప్రకటించే సమయంలో సాధారణంగా ఓటర్లలో 1 శాతం పెరుగుదల ఉంటుంది. ప్రతీ పోలింగ్ కేంద్రానికి నిర్దేశిత సంఖ్యలో ఓటర్లు ఉండాలి. కానీ ఏపీలో 3-4 శాతం మేర పెరుగుదల ఉండటం గుర్తించాం. అందుకే ప్రత్యేక సాఫ్ట్‌వేర్

తరువాయి 2లో..

## ప్రభుత్వ ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

### పోలవరం ప్రధానాంశంగా.. ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌పై సీఎం జగన్ సమీక్ష



గుంటూరు, (విజయభాను న్యూస్) : ఆంధ్రప్రదేశ్ జలవనరులశాఖపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం సమీక్ష నిర్వహించారు. సీఎం క్యాంప్ కార్యాలయంలో సంబంధిత మంత్రులు, ఉన్నతాధికారులతో ఆయన ఈ సమావేశం చేపట్టారు. సకాలంలో సాగునీరు: ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు క్యాలెండర్ ప్రకారం రైతులకు సాగునీరు విడుదలచేస్తున్నామని అధికారులు తెలిపారు. ఇప్పటికే గోదావరి, కృష్ణాడెల్టా, తోటపల్లి కింద ప్రాంతాలకు సాగునీరు విడుదల చేశామని వెల్లడించారు.

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం సమీపిస్తున్న కొద్దీ లెఫ్ట్ మెయిన్ కెనాల్‌పై కూడా దృష్టిపెట్టాలని సీఎం జగన్ అధికారులను ఆదేశించారు. కాగా ఈసీఆర్ఎఫ్ డ్యాం నిర్మాణ ప్రాంతంలో పనులు చురుగ్గా సాగుతున్నాయని అధికారులు తెలిపారు. ఈసీఆర్ఎఫ్ డ్యాం గ్యాప్-1లో శాండ్ ఫిల్లింగ్, వైబ్రోకాంపాక్షన్ పనులు పూర్తయ్యాయని పేర్కొన్నారు. గ్యాప్-2 వద్ద కూడా ఇదే పనులు చురుగ్గా సాగుతున్నాయని వెల్లడించారు. కేంద్ర జలశక్తి శాఖ, కేంద్ర జలమండలి అధికారులు గైడ్ బండ్‌లో కుంగిన ప్రాంతాన్ని పరిశీలించారని, నేల స్వభావంలో మార్పులు కారణంగా ఇది జరిగి ఉండొచ్చని అనుమానాన్ని కమిటీ వెల్లడించిందని తెలిపారు.దెబ్బతిన్న ప్రాంతాన్ని రాక్ డంప్‌తో సిమెంట్ స్లర్రీతో నింపాలని, గేబియన్స్‌తో సపోర్టు ఇవ్వాలని కమిటీ సూచించిందని సీఎం జగన్‌కు అధికారులు వివరించారు. ఆ మేరకు పనులు ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. పూర్తి విశ్లేషణ తర్వాత శాశ్వతంగా చేయాల్సిన మరమ్మతులను సూచిస్తామని కమిటీ చెప్పినట్టుగా వెల్లడించారు. పోలవరం తొలిదశను పూర్తిచేయడానికి కేంద్ర ఆర్థికశాఖ రూ.12,911.15 కోట్లు ఇచ్చేందుకు నిర్ణయం తీసుకుందని, కేంద్ర కేబినెట్‌లో పెట్టేందుకు కేబినెట్ నోట్ తయారీపై వివిధ

తరువాయి 2లో..

## జవహర్ నవోదయ స్కూళ్లలో ఆరో తరగతి ప్రవేశాలకు నోటిఫికేషన్

దిల్లీ: దేశవ్యాప్తంగా జవహర్ నవోదయ విద్యాలయాల్లో ఆరో తరగతి ప్రవేశాలకు నోటిఫికేషన్ వచ్చేసింది. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి దేశంలోని 649 జేఎన్‌వీల్లో సీట్ల భర్తీకి రెండు విడతల్లో ఈ పరీక్ష నిర్వహించనున్నట్టు అధికారులు వెల్లడించారు. ఇందులో భాగంగా నవంబర్ 4(శనివారం) ఉదయం 11.30గంటలకు పర్వత ప్రాంతాల్లోబీ 2024 జనవరి 20 (శనివారం) తేదీన తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని ఇతర ప్రాంతాల్లో ఈ ప్రవేశ పరీక్ష వర్ నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఈ పరీక్షకు అర్హులైన విద్యార్థులు ఆగస్టు 10వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు.

**అర్హత:** ప్రవేశానికి అర్హత పొందాలంటే విద్యార్థి తప్పనిసరిగా జవహర్ నవోదయ విద్యాలయం ఉన్న సంబంధిత జిల్లాల్లో నివాసి అయి ఉండాలి. విద్యార్థులు 2023-24

తరువాయి 2లో..

## అధికారం కోసమైతే నేను ఇంతలా కష్టపడాల్సిన పనిలేదు

### జనసేన అధినేత పవన్ కల్యాణ్

కాకినాడ, (విజయభాను న్యూస్) : ఆరో రోజు వారాహి యాత్రలో భాగంగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ మత్స్యకారుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాకినాడ జిల్లా ఏటిమొగ్గలో ఆయన సోమవారం పర్యటించారు. ప్రత్యేక బోటులో ఉప్పుటేరు మీదుగా వెళ్లి స్థానిక జాలరులతో సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా వారు ఎదుర్కొం టున్న పలు సమస్యలను జాలరులు పవన్ దృష్టికి తీసుకొచ్చారు. చేపల వేట విరామం వేళ ప్రభుత్వ జీవన భృతి అందడం లేదని వాపోయారు. చమురు పరిశ్రమల వల్ల నష్టపోతున్నామని జాలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. జాలరులతో భేటీ అనంతరం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. "నేను ఎంతో నిబద్ధతతో జనసేన పార్టీని ప్రారంభించా. అధికారమే అంతిమ లక్ష్యం అనుకుంటే ఇంత కష్టపడాల్సిన పనిలేదు. నాకు

తరువాయి 2లో..





మంగళగిరి తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో భవిష్యత్తు గ్యారెంటీ చైతన్య రథాలను ప్రారంభించిన జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, రాష్ట్ర పార్టీ అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు మరియు పార్టీ ముఖ్య నేతలు.

## జూలై 1 నుంచి అమర్‌నాథ్ యాత్ర

అమర్‌నాథ్ : అమర్‌నాథ్ యాత్ర జూలై 1 నుంచి ప్రారంభం కానుంది. ఇందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. యాత్రకు బయలుదేరే భక్తులు కూడా ఎంతో ఉత్సాహంగా ప్రయాణానికి అవసరమయ్యే అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆల్ జమ్ము హోటల్స్ అండ్ లాంజ్ అసోసియేషన్ అమర్‌నాథ్ యాత్రికులకు ఒక శుభవార్త తెలిపింది. అమర్‌నాథ్ యాత్రికులకు ప్రయాణ సమయాన ఇబ్బందులను దూరం చేస్తే వార్త ఇది. ఇది వారికి ఎంతో ఆనందాన్ని కలిగించనుంది. అమర్‌నాథ్ యాత్ర చేసేవారు ముందుగా హోటల్ బుక్ చేసుకుంటే వారికి భారీ రాయితీ లభించనుంది. ఈ విషయాన్ని ఆల్ జమ్ము హోటల్స్ అండ్ లాంజ్ అసోసియేషన్(ఏజేహెచ్ఎల్ఏ) ఒక ప్రకటనలో తెలియజేసింది. జమ్ములో బసచేసే అమర్‌నాథ్ యాత్రికులు ఇక్కడి హోటల్స్‌ను ముందుగానే బుక్ చేసుకుంటే 30 శాతం రాయితీ అందించనున్నట్లు ఏజేహెచ్ఎల్ఏ ఆ ప్రకటనలో తెలియజేసింది. ఈ

తరువాయి 2లో..

## శ్రీవాణి నిధులపై శ్వేతపత్రం

- దుష్ప్రచారం చేసేవారిపై చట్టప్రకారం చర్యలు
- టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం నిర్ణయం
- హిందూ ధర్మప్రచారంలో భాగంగా దేశవ్యాప్తంగా ఆలయాలు నిర్మిస్తున్నాం
- టీటీడీ ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి

*శ్రీవాణి ట్రస్టు నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలని టీటీడీ ధర్మకర్తల మండలి నిర్ణయించింది. ఈ అంశంపై రాజకీయ, వ్యక్తిగత ప్రయోజనాల కోసం టీటీడీపై దుష్ప్రచారం చేసేవారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని తీర్మానించింది. తిరుమల అన్నమయ్య భవనంలో సోమవారం ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి అధ్యక్షతన ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. ఇందులో తీసుకున్న నిర్ణయాలను ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి, ఈవో ధర్మారెడ్డితో కలిసి మీడియా ప్రతినిధులకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సనాతన హిందూ ధర్మప్రచారంలో భాగంగా దేశవ్యాప్తంగా ఆలయాలు నిర్మించడం కోసం 2019లో టీటీడీ శ్రీవాణి ట్రస్టును ఏర్పాటుచేసింది.*

వార్త 4లో...






# "జగనన్నకు చెబుదాం" కార్యక్రమానికి 77 వినతులు

## జివిఎంసి కమిషనర్ సి.ఎం. సాయి కాంత్ వర్మ



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : జివిఎంసిలో "జగనన్నకు చెబుదాం" అనే కార్యక్రమానికి 77 వినతులు వచ్చాయని జివిఎంసి కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ పేర్కొన్నారు. సోమవారం అయన జివిఎంసి ప్రధాన కార్యాలయంలో సమావేశ మందిరంలో జగనన్నకు చెబుదాం అనే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెండవ జోనుకు 12, మూడవ జోనుకు 5, నాలుగవ జోనుకు 14, ఐదవ జోనుకు 6, ఆరవ జోనుకు 16, ఏడవ జోనుకు 2, ఎనిమిదవ జోనుకు 5, జివిఎంసి ప్రధాన కార్యాలయానికి సంబంధించి 17 ఫిర్యాదులు అందాయని, అలాగే పరిపాలన విభాగానికి ఒకటి, రెవిన్యూ విభాగానికి 9, ప్రజా ఆరోగ్య విభాగానికి 6, టౌన్ ప్లానింగ్ విభాగానికి 27, ఇంజనీరింగ్ విభాగానికి 25, మొక్కల విభాగానికి 2, యుసిడి విభాగానికి 7, మొత్తం 77 ఫిర్యాదులు వచ్చాయని పేర్కొన్నారు. ప్రతి సోమవారం జివిఎంసి ప్రధాన కార్యాలయం నిర్వహిస్తున్న "జగనన్నకు చెబుదాం" కార్యక్రమంలో ప్రజల నుండి స్వీకరించిన వినతులు, సలహాలు ఆయా విభాగాధిపతులు చేపట్టిన చర్యలకు సంబంధించిన వివరాలతో కూడిన సమాచారాన్ని తర్వాత వచ్చే జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి సమర్పించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ డాక్టర్ వి సన్యాసిరావు, ప్రధాన ఇంజనీర్ రవికృష్ణ రాజు, సి.సి.పి. సునీత, సి.ఎం.ఒ.హెచ్. డాక్టర్ సురేష్ కుమార్, కార్యదర్శి నల్లనయ్య, డి.సి. (రెవెన్యూ) పణిరామ్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరావు, డి.డి.హెచ్. దామోదర్ రావు, ఎఫ్ ఏ & ఏవో మల్లికాంబ, డిపిఓ చంద్రిక, పర్యవేక్షి ఇంజనీరు కె.వి.ఎన్.రవి, వినయ్ కుమార్, వేణుగోపాలరావు, కృష్ణారావు, గోవిందరావు, రామ్మోహన్రావు, శాంసన్ రాజు, బయాలజిస్ట్ చక్రవర్తి, టిపిఆర్ఒ సూర్యకళ, డీసీపీలు, ఏసీపీలు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ బలోపేతమే లక్ష్యంగా కేడర్ పనిచేయాలి

## – బీజేపీ జిల్లా ఇంచార్జ్ పుట్ట గంగయ్య



కొత్తవలస (విజయభాను న్యూస్): విశాఖపట్నం పార్లమెంటరీ పరిధిలోని శృంగవరపుకోట నియోజకవర్గం కొత్తవలస మండలంలో బిజెపి నియోజకవర్గ ఇన్చార్జ్ సిహెచ్ ఆర్కె ప్రసాద్ సూచనల మేరకు కొత్తవలస బిజెపి పార్టీ అధ్యక్షులు చొక్కాకుల అప్పారావు ఏర్పాటుచేసిన శక్తి కేంద్ర ప్రముఖులతో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఇన్చార్జ్ పుట్ట గంగయ్య మరియు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులు మేడపాటి రవీంద్ర రెడ్డి హాజరై శక్తి కేంద్ర ప్రముఖులను ఉద్దేశించి సూచనలు చేశారు. అందరూ 2024 సార్వత్రిక ఎన్నికలలో మన పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేసి పార్టీని బలోపేతం చేయాలని అలాగే మన ప్రియతమ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పదవి బాధ్యతలు చేపట్టి తొమ్మిది సంవత్సరాలు గడిచిన సందర్భంగా భారత ప్రభుత్వం అమలు చేస్తున్నటువంటి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి పార్టీని గ్రామస్థాయి వరకు తీసుకెళ్లవలసిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో విశాఖపట్నం పార్లమెంట్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి ఎస్.దానేష్, ఉపాధ్యక్షురాలు చొక్కాకుల జగదీశ్వరి, పార్టీ సీనియర్ నాయకులు మాన్యం దేవుడు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు తమటపు రాము, యువమోర్చా అధ్యక్షుడు పోలుపర్తి శివకుమార్, శక్తికేంద్ర ప్రముఖులు బంగారు సత్యనారాయణ, విన్నకోట గణేష్, పి. త్రినాథ్, కిషన్ మోర్చా అధ్యక్షుడు సిహెచ్ త్రిమూర్తులు, మహిళా మోర్చా అధ్యక్షురాలు సిహెచ్ రమణమ్మ మరియు బిజెపి ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



# జూలై 1 నుంచి అమర్‌నాథ్ యాత్ర

సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు పవన్‌గుప్తా మాట్లాడుతూ తాము సదుద్దేశంతో అమర్‌నాథ్ యాత్రికులలో ఇక్కడి హెూటల్స్‌లో బసచేసేవారికి 30 శాతం రాయితీ అందజేస్తున్నట్లు తెలిపారు. తద్వారా అమర్‌నాథ్ యాత్రికులకు ఆర్థికంగా ఉపశమనం కలుగుతుందన్నారు.

జూలై 1 నుంచి అమర్‌నాథ్ యాత్ర

ఎంతో పవిత్రంగా భావించే అమర్‌నాథ్ గుహ దక్షిణ కశ్మీర్‌లోని హిమాలయాల నడుమ, సమద్ర మట్టానికి 3,880 మీటర్ల ఎత్తులో ఉంది. జూలై 1 నుంచి ?ప్రారంభమయ్యే ఈ 62 రోజుల తీర్థయాత్ర రెండు మార్గాల గుండా సాగుతుంది. వాటిలో ఒకటి అనంత్‌నాగ్ జిల్లాలో 48 కిలోమీటర్ల పొడవున సాగుతుంది. మరొకటి బందర్బల్ జిల్లాలో 14 కిలోమీటర్ల పొడవున కొనసాగుతుంది. ఈ యాత్రలో పాల్గొనేవారు జూన్ 30 నాటికి జమ్మునకు చేరుకోవాల్సి ఉంటుంది. కాగా ఈసారి అమర్‌నాథ్ యాత్రకు భారీ సంఖ్యలో భక్తుల వస్తారని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తోంది.

# ప్రభుత్వ ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

మంత్రిత్వశాఖల మధ్య సంప్రదింపులు కొలిక్కి వస్తున్నాయని వెల్లడించారు. పోలవరం మొదటి దశ పరిధిలోకి వచ్చే 20,946 ముంపు బాధిత కుటుంబాల్లో 12,658 మందిని ఇప్పటికే తరలించామని, మిగిలిన 8,288 మందిని తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు చెప్పారు.

ప్రాధాన్యత ప్రాజెక్టుల పూర్తికి ప్రత్యేక శ్రద్ధ: సీఎం జగన్

ప్రభుత్వం ప్రాధాన్యతగా నిర్దేశించుకున్న ప్రాజెక్టుల పూర్తిపై ప్రత్యేక దృష్టిపెట్టాలని సీఎం జగన్ అధికారులను ఆదేశించారు. ప్రతి 15 రోజులకోసారి పనుల ప్రగతిని సమీక్షించుకోవలన్నారు. ఈ మేరకు కార్యాచరణ చేసుకుని వేగంగా వాటిని పూర్తిచేయాలన్నారు. వెలగొండ, వంశధార, అవుకు సహా పలు ప్రాధాన్యతా ప్రాజెక్టుల్లో పరిస్థితులను సీఎం సమీక్షించారు. ఈ ప్రాజెక్టుల ప్రగతిని ముఖ్యమంత్రికి అధికారులు నివేదించారు. అవుకు రెండో టన్నెల్ నిర్మాణం పూర్తి, చివరిదశలో లైనింగ్ కార్యక్రమం ఉందని, ఆగస్టులో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు వెల్లడించారు. అవుకు ద్వారా 20వేల క్యూసెక్కుల సముద్రంలో కలిసే కృష్ణా వరదజలాలను రాయలసీమ దుర్భిక్షప్రాంతానికి తరలించేందుకు మార్గం సుగమమైందని, వరదలు సమయంలో సముద్రంలో కలవకుండా నీటిని కరవుపీడిత ప్రాంతాలకు తరలించే అవకాశం ఉంటుందని తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టు పనులపై పురోభివృద్ధిని ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. ఇప్పటికే మొదటి టన్నెల్ పూర్తయ్యిందని, రెండోటన్నెల్ పనులుకూడా కొలిక్కివస్తున్నాయని తెలిపారు. పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టులో రెండో టన్నెల్ హెడ్ రెగ్యులేటర్ పనులు 92.14శాతం పూర్తయ్యాని, ఆగస్టు నాటికి హెడ్ రెగ్యులేటర్ పనులు పూర్తిచేస్తామన్నారు. టన్నెల్ తవ్వకం పనులు 18,787 మీటర్లకుగానూ, 17,461 మీటర్లు పూర్తిచేశామన్న అధికారులు. నీటిని తరలించడానికి వీలైనంత తర్వగా మిగిలిన పనులు త్వరగా పూర్తిచేయాలని సీఎం ఆదేశించారు. వెలిగొండ ప్రాజెక్టులో భాగంగా గొట్టిపాడు డ్యాం, కాకర్ల డ్యాం, తీగలేరు అప్రోచ్ ఛానల్, తీగలేరు హెడ్ రెగ్యులేటర్, ఈస్ట్రన్ మెయిన్ కెనాల్ హెడ్ రెగ్యులేటర్ పనులు దాదాపుగా పూర్తికావొచ్చాయని అధికారులు తెలిపారు

వంశధార పనులపైనా సీఎం సమీక్ష.

ఈ ఏడాది వంశధార స్టేజ్–2, ఫేజ్–2 కింద డిస్ట్రిబ్యూటరీ నెట్‌వర్క్‌ను కూడా పూర్తిచేస్తున్నామని అధికారులు తెలిపారు. గొట్టాబ్యారేజీ నుంచి కూడా ఎత్తిపోతల ద్వారా హిరమండలం రిజర్వాయర్‌ను నింపే కార్యక్రమం వీలైనంత త్వరగా కార్యరూపం దాల్చాలని సీఎం జగన్ ఆదేశించారు. తోటపల్లి బ్యారేజీ కింద మిగిలిపోయిన పనులు, తారకరామ తీర్థసాగర్, మహేంద్ర తనయ రిజర్వాయర్లపై సీఎం సమీక్ష. ఈ పనులన్నీ వేగంగా జరుగుతున్నాయని అధికారుల వెల్లడి. వీటి తర్వాత ప్రాధాన్యతగా నిర్ణయించుకున్న ప్రాజెక్టులపైనా సీఎం సమీక్ష. కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులు దాదాపుగా పూర్తికావొచ్చాయని అధికారులు తెలిపారు.

ఏపీ నాలుగు జాతీయ జల అవార్డులు (నేషనల్ వాటర్ అవార్డ్స్ 2022) దక్కించుకోవడంపై మంత్రి, అధికారులను సీఎం జగన్ అభినందించారు. ఈ సమావేశానికి జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, చీఫ్ సెక్రటరీ డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి, జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశి భూషణ్ కుమార్ తదితరులు హాజరయ్యారు.

# అధికారం కోసమైతే నేను ఇంతలా కష్టపడాల్సిన పనిలేదు

ఉన్న సామర్థ్యానికి ఏదో పదవి పొందొచ్చు. ఇన్ని మాటలు పడాల్సిన అవసరం లేదు. ఈ సీఎంలాగా అద్భుతాలు చేస్తానని చెప్పడం లేదు. బటన్ నొక్కితే డబ్బులు పడతాయని కూడా చెప్పను. ఉప కులాల మధ్య ఐక్యత ఉండాలి. సరైన వ్యక్తులను మీరు నమ్మడం లేదు. బతికే హక్కు అందరికీ ఉంది. దానికి భంగం కలిగినప్పుడు పోరాడాల్సిందే. మీ విశ్వాసం సరైన వ్యక్తులపై పెట్టడం లేదు. రెండు చేతులు ఎత్తి నమస్కరిస్తున్నా. వచ్చే ఎన్నికల్లో నన్ను గెలిపించండని అభ్యర్థిస్తున్నా.

రాష్ట్రంలోని ఇసుకంతా పెద్దిరెడ్డికి చెందిన మూడు కంపెనీలకే వెళ్లిపోతోంది. ఆ ఇసుక విలువ ఎంత లేదన్నా.. రూ. 10వేల కోట్లు ఉంటుంది. అది అంతా ఒక్కరి వద్దకే వెళ్తోంది. మీరు నాకు అండగా ఉంటే మీ సమస్యలను కేంద్రంలోని పెద్దల దృష్టికి తీసుకెళ్తాను. మీ బాధలు వారికి వినిపిస్తా. మీ ఆరోగ్యం, ఉపాధి కోసం సంపూర్ణంగా కృషి చేస్తాం. ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థకు మీ కష్టం, మీ రక్తం, శ్రమ ద్వారా రూ.వేల కోట్లు సమకూరుతోంది. మీ ఆదాయాన్ని ఇంకెవరో దోచేస్తున్నారు. మీరు నా కోసం నిలబడితే నేను మీ కోసం పోరాటం చేస్తా. నేను ఎవరితోనూ కుమ్మక్కవడం లేదు. నాకు ఎవరితోనూ కాంట్రాక్టులు లేవు. ఎలాంటి వ్యాపారాలూ లేవు. చమురు సంస్థలతో మాట్లాడతా. బీసీ కులాలపై అధ్యయనం చేసి వచ్చాను. మీరు మద్దతు ఇవ్వండి.. అండగా ఉంటా" అని జనసేనాని తెలిపారు.

## అవన్నీ నకిలీ ఓట్లు కాబట్టే

# ఎవరూ ఫిర్యాదు చేయలేదు

ద్వారా ఒకే ఫొటోతో ఉన్న 15 లక్షల మంది ఓటర్లను గుర్తించాం. 2022లో 10 లక్షల మందిని గుర్తించి జాబితా నుంచి తొలగించాం. డూప్లికేట్ ఓట్లను మాత్రమే తొలగించాం. ఓట్ల తొలగింపుపై చాలా కథనాలు వచ్చాయి. కానీ దాని వెనుక ఈ తరహా కారణాలున్నాయి. ప్రస్తుత డేటా ప్రకారం పెద్ద సంఖ్యలో ఓట్లను తొలగించటం అన్నది అవాస్తవం. ఓటర్ల జాబితాను సవ్యంగా రూపొందించాలన్నదే ఎన్నికల సంఘం ఉద్దేశం. 1.62 కోట్ల ఇంటి నంబర్లు రాష్ట్రంలో ఉన్నాయి. వాటిలో 3.98 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. 50 కంటే ఎక్కువ ఓట్లు ఉన్న ఇంటి నంబర్లు 2,100 వరకు ఉన్నాయి. ఇలా ఉన్న ఇళ్లను తనిఖీ చేయాల్సిందిగా ఆదేశాలు ఇచ్చాం. ఇందులో సిబ్బంది నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం ఉండొచ్చు. అలాగే కావాలని చేసినవి కూడా ఉండొచ్చు. అక్టోబర్ 15 నాటికి తదుపరి ఓటర్ల ముసాయిదా జాబితా సిద్ధం చేస్తాం. ఆ సమయానికి ఈ తరహా పొరపాట్లు లేకుండా జాబితాను రూపొందించి విడుదల చేస్తాం. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం పరిధిలోనూ ఈ తరహాలోనే జరిగిందని భావిస్తున్నాం. ఉరవకొండలో నియోజకవర్గంలో కావాలని ఓట్లు తొలగించిన ఇద్దరు బీఎల్ఓలను సస్పెండ్ చేశాం. వాలంటీర్లు ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములు అయ్యేందుకు వీల్లేదు. దీనిపై ఇప్పటికే ఎన్నికల సంఘం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది" అని ముకేష్ కుమార్ మీనా వెల్లడించారు.


# జవహర్ నవోదయ స్కూళ్లలో ఆరో తరగతి ప్రవేశాలకు నోటిఫికేషన్

విద్యా సంవత్సరంలో ఆయా జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఐదో తరగతి చదువుతుండాలి. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు 75 శాతం సీట్లు కేటాయించారు. వారు 3, 4, 5 తరగతులు గ్రామీణ ప్రాంత పాఠశాలల్లోనే చదివి ఉండాలి. మిగిలిన 25శాతం సీట్లు పట్టణ ప్రాంత విద్యార్థులకు కేటాయించారు. **వయసు:** దరఖాస్తు చేసుకునే విద్యార్థులు మే 1, 2012 నుంచి జులై 31, 2014 మధ్యలో జన్మించిన వారై ఉండాలి. **ప్రవేశ పరీక్ష:** జవహర్ నవోదయ ప్రవేశానికి నిర్వహించే రాత పరీక్షలో వచ్చే మార్కులు ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేస్తారు. ప్రవేశ పరీక్ష ప్రశ్నపత్రంలో మూడు విభాగాలు(మెంటల్ ఎబిలిటీ, అరిథ్‌మెటిక్, లాంగ్వేజ్) ఉంటాయి. మొత్తం 80 ప్రశ్నలు 100 మార్కులకు 2 గంటల సమయంలో ప్రవేశ పరీక్ష ఉంటుంది. **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో https://navodaya.gov.in/nvs/en/Home1 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొనేందుకు అభ్యర్థులు నిర్ణీత ఫార్మాట్‌లో అభ్యర్థి వివరాలను పేర్కొంటూ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ధ్రువీకరించిన సర్టిఫికెట్ సాఫ్ట్ కాపీని అప్‌లోడ్ చేయడం తప్పనిసరిని. దీంతో పాటు అభ్యర్థి ఫొటో, అభ్యర్థి, తల్లిదండ్రుల సంతకాలు, ఆధార్ వివరాలు/ నివాస ధ్రువపత్రాల అవసరం ఉంటుంది. **ఎంపిక ప్రక్రియ:** ప్రవేశ పరీక్ష ఆధారంగా సీటు కేటాయిస్తారు. రెండు విడతల్లో నిర్వహించే ఈ పరీక్ష ఫలితాలను వచ్చే ఏడాది మార్చి/ఏప్రిల్‌లో విడుదల చేసే అవకాశం ఉంది.

**పరీక్ష ఇలా..** నిర్ణీత తేదీల్లో ఉదయం 11.30గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు రెండు గంటల పాటు జరిగే ఈ పరీక్ష 100 మార్కులకు ఉంటుంది. మొత్తం 80 ప్రశ్నలు ఇస్తారు. దీంట్లో మెంటల్ ఎబిలిటీ నుంచి 40 ప్రశ్నలకు 50 మార్కులు ఉంటాయి. దాంతో పాటు అర్థమెటిక్ నుంచి 20 ప్రశ్నలకు 25 మార్కులుబీ లాంగ్వేజ్ టెస్ట్ 20 ప్రశ్నలకు 25 మార్కుల చొప్పున ఇస్తారు. మెంటల్ ఎబిలిటీకి గంట సమయం ఉండగా.. మిగతా రెండింటికీ చెరో అర్ధగంట పాటు సమయం ఇస్తారు.

# ప్రధాన గెడ్డలోని పూడికలు తొలగించండి

## జివిఎంసి కమిషనర్ సి.ఎం. సాయి కాంత్ వర్మ



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని నగరంలోని ప్రధాన గెడ్డలోని పూడికలు తొలగించాలని జివిఎంసి కమిషనర్ సి.ఎం.సాయి కాంత్ వర్మ ప్రజారోగ్యపు అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా 6 వ జోన్ 76వ వార్డు పరిధిలోని జగ్గు జంక్షన్, కణితి రోడ్డు, పెదగంట్యాడ, నడిపూరు ఏ పీ హెచ్ బి కాలనీ, గంగవరం పోర్టు రోడ్డు తదితర ప్రాంతాలలో వార్డు కార్పొరేటర్ గంధం శ్రీను తో కలిసి పర్యటించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని నగరంలోని ప్రధాన గెడ్డలోని పూడికలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. రోడ్లు పై వర్షపు నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని, పారిశుద్ధ్య పనుల విషయంలో నిర్లక్ష్యం వహించకుండా వ్యర్థాలను ఎప్పటికప్పుడే శుభ్రం చేసి డంపింగ్ యార్డ్ కి తరలించాలని అధికారులను ఆదేశించారు. కణితి రోడ్డు లో ఉన్న ప్రధాన గెడ్డ వర్షాకాలంలో పొంగి మురుగునీరు రోడ్డుపైకి వస్తున్నందున ఇరువైపులా రక్షణ గోడ నిర్మించాలని, డంపింగ్ యార్డ్ లో వద్ద గెడ్డను వెడల్పు చేయాలని, పెదగంట్యాడ లోని శివాజీ పార్కును ఆధునికరించాలని స్థానిక కార్పొరేటర్ కమిషనర్ దృష్టికి తీసుకురాగా గంగవరం, స్టీల్ ప్లాంట్ సంబంధించిన అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించేందుకు కృషి కమిషనర్ హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో ఎ.ఎమ్.ఓ.హెచ్. కిరణ్ అసిస్టెంట్ ఇంజనీర్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## అమర్నాథ్ కుటుంబానికి తెదేపా రూ.10లక్షలు సాయం: చంద్రబాబు



రేపల్లె: బాపట్ల జిల్లా రేపల్లె నియోజకవర్గం ఉప్పలవారిపాలెంలో దారుణ హ్యతకు గురైన పదో తరగతి విద్యార్థి అమర్నాథ్ కుటుంబీకులను తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు సోమవారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి తెదేపా తరఫున రూ.10లక్షలు ఆర్థిక సాయం అందించారు. అమర్నాథ్ కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని చంద్రబాబు భరోసా ఇచ్చారు. తొలుత చంద్రబాబును చూసి అమర్నాథ్ కుటుంబసభ్యులు తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. అమర్నాథ్ హత్య ఘటనకు సంబంధించిన వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. చంద్రబాబు వస్తున్నారని తెలిసి అమర్నాథ్ నివాసం వద్దకు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

# అలేఖ్యకు అభినందనలు



గాజువాక (విజయభాను న్యూస్) : ఈనెల 9వ తేదీ నుండి 15వ తేదీ వరకు అస్సాం రాష్ట్రంలోని కజిరంగా యూనివర్సిటీలో జరిగిన జాతీయ సమైక్యత శిబిరంలో పాల్గొన్న సెయింట్ ఆన్స్ కళాశాల జాతీయ సేవా పథక కార్యకర్త వి.అలేఖ్యను పలువురు ప్రశంసించారు. ఈ సందర్భంగా సెయింట్ ఆన్స్ కళాశాలలో జరిగిన అభినందన సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ప్రేమ కుమారి మాట్లాడుతూ - భిన్నత్వంలో ఏకత్వమే భారత దేశ విశిష్ట లక్షణమని అన్నారు. జాతీయ సమైక్యత శిబిరాలలో పాల్గొనడం వల్ల విద్యార్థులకు దేశ సంస్కృతి పట్ల మంచి అవగాహన ఏర్పడుతుందని అన్నారు. అరుదైన ఈ జాతీయ గౌరవాన్ని దక్కించుకున్న అలేఖ్య కు అభినందనలు తెలియజేశారు. సమావేశానికి అధ్యక్షత వహించిన జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ పి.ఎస్. భాగ్యలక్ష్మి మాట్లాడుతూ- ఆంధ్ర ప్రదేశ్ నుండి ఐదుగురు అమ్మాయిలు, ఐదుగురు అబ్బాయిలు ఈ శిబిరంలో పాల్గొన్నారని, అందులో అలేఖ్య ఒకరు కావడం గర్వించదగ్గ విషయమని అన్నారు. ఇతర వాలంటీర్లు ఆమెను స్ఫూర్తిగా తీసుకొని జాతీయ సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని అన్నారు. జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై. అనసూయదేవి మాట్లాడుతూ- ఇటువంటి జాతీయ స్థాయి అవకాశాన్ని తమ వాలంటీర్లకు ఇచ్చినందుకు ఆంధ్ర విశ్వ విద్యాలయానికి, యువజన, క్రీడల కేంద్ర మంత్రిత్వ శాఖకు కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ సమావేశంలో ఇతర ప్రోగ్రాం అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు

## ఆదర్శ్ హిందీ ప్రేమిమండలి విద్యార్థులకు హిందీ పుస్తకాలు అందజేసిన వుయ్ కేర్ యు సంస్థ అధినేత వెంపాడ శ్రీనివాసరెడ్డి



భీమునిపట్నం, విజయభాను న్యూస్ విద్య, సామాజిక సేవలో అనునిత్యం మమేకమై సహకారం అందించడంలో వుయ్ కేర్ యు సంస్థ అధినేత వెంపాడ శ్రీనివాసరెడ్డి ఎప్పుడూ ముందుంటారని ఆదర్శ్ హిందీ ప్రేమిమండలి గౌరవ అధ్యక్షులు గంటా నూకరాజు అన్నారు.వెంపాడ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో భీమిలి శాఖ ఆదర్శ్ హిందీ ప్రేమిమండలి విద్యార్థులకు హిందీ పరిచయ్ పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గంటా నూకరాజు మాట్లాడుతూ ఎంతోమంది పేద విద్యార్థులకు హిందీ ప్రత్యేకంగా నేర్చుకోవాలన్న కుతూహలం ఉన్నా వారికున్న ఆర్థిక ఇబ్బందులు కారణంగా ముందుకు రాలేకపోతున్నారని అన్నారు. వ్యవస్థాపక అధ్యక్షులు కె ఎస్ ఆర్ కృష్ణారావు మాస్టర్ భీమిలిలో ఆదర్శ్ హిందీ ప్రేమిమండలిని స్థాపించి విద్యార్థులకు ఫీజులు, పుస్తకాలు ఉచితంగా అందిస్తూ వివిధ రకాల పరీక్షలకు తర్ఫీదు ఇస్తున్నారని అన్నారు. నేటికి కొన్ని వేలమందికి హిందీలో ప్రావీణ్యం పొందేవిధంగా కృషి చేశారని అన్నారు. దాతలు ముందుకు వచ్చి విద్యార్థులకు వారికి తోచిన సాయం చేస్తున్నారని అన్నారు. నేడు విద్యార్థులకు పుస్తకాలు పంపిణీకి సహకరించిన వెంపాడ శ్రీనివాసరెడ్డికి గంటా నూకరాజు ధన్యవాదాలు తెలియజేశారు.

## భరణికములో జగనన్న సురక్ష ప్రోగ్రాం పై అవగాహన



పరవాడ (విజయభాను న్యూస్) : పరవాడ మండలం భరణికము గ్రామంలో సచివాలయం కార్యాలయంలో సోమవారం జగనన్న సురక్ష ప్రోగ్రాం పే అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీడీవో హేమ సుందర్ రావు, తహసిల్దార్ పి కనకారావు, స్థానిక సర్పంచ్ పెద్ది శెట్టి శేఖర్ హాజరయ్యారు... ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ సర్కార్ ప్రభుత్వం ఈనెల 23వ తేదీ నుంచి అమలు చేయబోతున్న జగనన్న సురక్ష కార్యక్రమం పై అవగాహన కల్పించారు... ప్రతి ఇంట్లో సమస్యను తక్షణం పరిష్కరించే దిశగా ఈ కార్యక్రమం ఉండబోతుందని పేర్కొన్నారు... ఈ కార్యక్రమంలో స్థానిక పంచాయతీ కార్యదర్శి జానకేశ్వరరావు, వీఆర్వో శ్రీనివాసరావు సచివాలయం సిబ్బంది వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు..

# స్పందన ఫిర్యాదు పై విచారణ చేపట్టిన

## పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈఈ



పరవాడ (విజయభాను న్యూస్) : రాంకీ ఫార్మసిటీ యాజమాన్యం నిబంధనలుకు విరుద్ధంగా తానాం సమీపంలో ఫాండ్ నిర్మాణం చేసారని దీనిపై గతములో స్పందనలో కలెక్టర్ కు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ పిర్యాదు చేస్తే, ఈ పాండ్ ను పూడ్చి వేయాలని కలెక్టర్, రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఆర్డర్ ఇచ్చినా సంబంధించిన అధికారులు గాని రాంకీ యాజమాన్యం కాని ఈ పాండ్ పూడ్చి వేయలేదని ఫిర్యాదు పై సోమవారం పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈ ఈ నాగేంద్రరెడ్డి సంబంధిత ప్రాంతాన్ని సందర్శించారు. ఈయనతో పాటు పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఏఈ శ్రీనివాసరావు పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ సైంటిస్ట్ శ్రీరామ్ స్పందనలో ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ చేపట్టారు నిబంధనలకు విరుద్ధంగా ఫార్మా పరిశ్రమల యొక్క రస వ్యర్థ జలాలు కాలువలో వస్తున్నాయని గుర్తించినట్లు ఆయన తెలిపారు పది రోజుల్లో రాంకీ యాజమాన్యానికి నోటీసులు జారీ చేసి తదుపరి విచారణ చేసి సమగ్రంగా చర్యలు చేపడతానని ఈ ఈ హామీ ఇచ్చారు నేను కొత్తగా బాధ్యతలు చేపట్టానని వీటిపై పూర్తిగా అధ్యయనం చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు, ఈ కార్యక్రమములో...

విచారణలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ, మాజీ జెడ్పిటిసి పైల జగన్నాథరావు, రైతులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ మంత్రి బండారు జన్మదిన వేడుకలు

## కార్యకర్తలు నాయకులు మధ్య కేక్ కటింగ్



పరవాడ (విజయభాను న్యూస్) : మాజీ మంత్రివర్యులు బండారు సత్యనారాయణమూర్తి జన్మదిన సందర్భంగా వెన్నెల పాలెం గ్రామంలో జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మండల తెలుగుదేశం పార్టీ నాయకులు పైల జగన్నాథ రావు (మాజీ జెడ్ పి టి సి, మాజీ ఎంపీపీ, మాజీ ఆర్ ఇ సి ఎస్ చైర్మన్), మాసవరపు అప్పలనాయుడు (మాజీ ఎంపీపీ), అట్టా సన్యాసప్పారావు మాజీ సర్పంచ్, వియ్యపు చిన్న (మండల పార్టీ అధ్యక్షులు), ఓమ్మి వెంకట్రావు ఎంపీటీసీ, బోండా తాతారావు మాజీ సర్పంచ్ , గొర్లి కనకారావు మాజీ సర్పంచ్, పైల రామచంద్రరావు, కూండ్రపు శ్రీరామ్మూర్తి (మాజీ ఎంపీటీసీ) , రాయవరపు దేవుడు మాజీ సర్పంచ్, సూరాడ బంగారు రాజు ఎంపీటీసీ, మడక రాజు నాయుడు మాజీ సర్పంచ్, రొంగలి గోపాలకృష్ణ ఎంపీటీసీ, ఇందల కొండలరావు - ప్రధాన కార్యదర్శి, పైల రామచంద్రరావు (టిడిపి సీనియర్ నాయకులు), పైల రథాల సన్యాసిరావు మాజీ ఎంపిటిసి, నగిరెడ్డి చిన్నారావు, పాల అచ్చల నాయుడు, బంధం రమణ, సారి పల్లె జోగు నాయుడు మాజీ ఎంపీటీసీ, వర్రీ పర దేశి నాయుడు , చీపురుపల్లి శ్రీను, పైల చిన్నఅక్కు నాయుడు, మేడిశెట్టి బాలాజీ నాయుడు, పైలాసన్యాసి నాయుడు( స్వామి), లోకిరెడ్డి సన్యాసినాయుడు (అభి )మచ్చ శివ,గొంప మారు నాయుడు, పైలా వరలక్ష్మి , పైలా కుమారి, తదితరులు పుష్ప గుచ్చం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియపరిచారు.. ఈ సందర్భంగా పలువురు నాయకులు కార్యకర్తలు మాట్లాడుతూ మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి ఇటువంటి జన్మదిన వేడుకలు మరిన్ని జరుపుకోవాలని, రానున్న రోజుల్లో ఆయనించుకున్న రాజకీయ రంగంలో ఉన్నత శిఖరాలను అవరోధించాలని పలువురు ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో...

పెందుర్తి నియోజకవర్గం లో గల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వాంబే కాలనీ వాసుల మంచి నీటి సమస్య పరిష్కరించాలంటూ ధర్నా



గాజువాక (విజయభాను న్యూస్ ): జీవీఎంసీ 65వ వార్డు వంబే కాలనీ వాసులు మంచి నీటి సమస్య పరిష్కరించాలంటూ తెదేపా నాయ కులు రట్టి వాసు అధ్వైర్యంలో జీవీ ఎంసీ గాజువాక జోన్-6 కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. అనం తరం జోనల్ కమిషనర్ సింహాచలం కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్బంగ వారు మాట్లాడుతూ గత కొంత కాలంగా నీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులకు గురవు తున్నామని గత 18 ఏళ్లుగా ఇంటి పన్ను నీటి పన్ను ఆఖరికి చెత్త పన్ను కూడా కడుతున్నామని అయినా మంచి నీటి సమస్య పరిస్కారం కావడం లేదని వాపోయారు. పలుమార్లు జోనల్ కమిషనర్ వాటర్ ఏ ఈ స్థానిక కార్పొరేటర్ కు ఈ నీటి సమస్యపై వినతిపత్రం అందజేశామని కానీ జోనల్ కమిషనర్. వాటర్ ఏఈ సమస్య పరిష్కరించలేదని స్థానిక మహిళలు వాపోయారు. వారికి 65వ వార్డ్ టిడిపి అధ్యక్షులు రట్టి వాసు వార్డ్ ఇంచార్జ్ బైపిలి గాంధీ, వార్డ్ ఉపాధ్యక్షులు దాట్ల శ్రీనివాస్ రావు,టిడిపి నాయకులు కెవిఎస్ ప్రసాద్, సంతోష్ ధర్నా కూ మద్దతు తెలిపి అనంతరం రట్టి వాసు బైపిల్లి గాంధీ మాట్లాడుతూ తక్షణమే నీటి సమస్యను పరిష్కరించాలని లేనియెడల తెలుగుదేశం పార్టీ తరపున కాలనీ వాసులతో విశాఖ జిల్లా పార్లమెంటరీ టిడిపి అధ్యక్షులు మాజీ గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లి వాంబే కాలనీ 672 కుటుంబాలతో పార్టీ నాయకులతో కలిసి బిందెలతో మహా ధర్నా నిర్వహిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో...

వాంబే కాలనీ వాసులు తెదేపా నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రాహుల్ గాంధీ జన్మదినోత్సవ వేడుకలు



అక్కయ్యపాలెం (విజయభాను న్యూస్) : కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ 52వ జన్మదినోత్సవ వేడుకలను విశాఖ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా సోమవారం నిర్వహించారు. నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొ%శీ%ప గోవిందరాజు సారధ్యంలో పార్టీ శ్రేణుల నాయకుల నడుమ కేక్ కట్ చేసి ఆనందోత్సవాల మధ్య జన్మదినోత్సవ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొ%శీ%ప గోవిందరాజు మాట్లాడుతూ రాబోయే 2024 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రాహుల్ గాంధీ నాయకత్వంలో విజయం సాధిస్తుందని, కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అవుతుందని చెప్పారు. వచ్చే పుట్టిన రోజు వేడుకలు రాహుల్ గాంధీ ప్రధానమంత్రి హెూదాలో చేసుకుంటారని అభిలాషిస్తున్నామన్నారు.కేంద్రంలో కాంగ్రెస్ పరిపాలన రాగానే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హెూదాతో పాటు విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రభుత్వం రంగంలోనే కొనసాగే విధంగా రాహుల్ గాంధీ చేయగలరని అన్నారు. ప్రధానమంత్రి మోడీకి చంద్రబాబు, పవన్ కళ్యాణ్, జగన్ ఏజెంట్లుగా పని చేస్తున్నారని రాష్ట్రానికి వీళ్లు ఎటువంటి న్యాయం చేయడం లేదన్నారు. ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూ ప్రజల ముందు దొంగ నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి అన్ని రకాలుగా అన్యాయం చేస్తున్న నోరు మెదపడం లేదన్నారు. కేంద్రంలో బిజెపి పార్టీ మతతత్వ అరాచక పాలనకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ తరఫున రాహుల్ గాంధీ అలుపెరగని పోరాటం చేస్తున్నారని ఆయన పోరాట ఫలితంగా కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజల మద్దతు ఏర్పాటు అయిందని గుర్తు చేశారు.

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్ లాంటి ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ ప్రైవేటు రంగానికి, కార్పొరేట్ రంగానికి అప్పగిస్తూ దేశాన్ని దోపిడీ చేస్తుందని విమర్శించారు. మరోపక్క పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్, నిత్యవసర ధరలు పెంచి మధ్యతరగతి ప్రజలను నిలువు దోపిడీ చేస్తూ ప్రశ్నించే వారిని అణచి వేస్తుందన్నారు. ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నారని రాబోయే ఎన్నికల్లో సరైన తీర్పు ఇస్తారని, బిజెపి పార్టీని ఇంటికి పంపే పరిస్థితులు కనబడుతున్నాయని అన్నారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వర్జిపర్తి శ్రీనివాసరావు, బమ్మిడి గంగాధర్, గుత్తుల శ్రీనివాసరావు, నియాజ్, మహిళా కాంగ్రెస్ లక్ష్మి, మంత్రి చంద్రశేఖర్, భగత్, కస్తూరి వెంకట్రావు, చినబాబు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీవాణి నిధులపై శ్వేతపత్రం

■ దుష్ప్రచారం చేసేవారిపై చట్టప్రకారం చర్యలు ■టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం నిర్ణయం

■ హిందూ ధర్మప్రచారంలో భాగంగా దేశవ్యాప్తంగా ఆలయాలు నిర్మిస్తున్నాం

■- టీటీడీ ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి



తిరుమల/తిరుపతి(విజయభాను న్యూస్) : శ్రీవాణి ట్రస్టు నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలని టీటీడీ ధర్మకర్తల మండలి నిర్ణయించింది. ఈ అంశంపై రాజకీయ, వ్యక్తిగత ప్రయోజనాల కోసం టీటీడీపై దుష్ప్రచారం చేసేవారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని తీర్మానించింది. తిరుమల అన్నమయ్య భవనంలో సోమవారం ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి అధ్యక్షతన ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. ఇందులో తీసుకున్న నిర్ణయాలను ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి, ఈవో ధర్మారెడ్డితో కలిసి మీడియా ప్రతినిధులకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సనాతన హిందూ ధర్మప్రచారంలో భాగంగా దేశవ్యాప్తంగా ఆలయాలు నిర్మించడం కోసం 2019లో టీటీడీ శ్రీవాణి ట్రస్టును ఏర్పాటుచేసింది. ఈ నిధులతో రాష్ట్రంలోని 26 జిల్లాలతోపాటు తెలంగాణ, పాండిచ్చేరి, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లోని గిరిజన, ఎస్సీ, మత్స్యకార గ్రామాల్లో మొత్తం 2,445 ఆలయాల నిర్మాణం జరుగుతోంది. ఈ ట్రస్టు నిధులతో పురాతన ఆలయాల పునరుద్ధరణ, నూతన ఆలయాల నిర్మాణం, ఆలయాల ధూపదీప నైవేద్యాలకు ఆర్థికసాయం అందిస్తున్నాం. టీటీడీలో పూర్తి పారదర్శక పాలన జరుగుతోంది. ఇందుకు సంబంధించి మా పాలకమండలి టీటీడీ ఆస్తులపై 2021 జూన్ 21వ తేదీన, బంగారు, నగదు డిపాజిట్లపై 2022 నవంబరు 5వ తేదీన శ్వేతపత్రాలు విడుదల చేయడం జరిగింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో సుమారు 300 పురాతన ఆలయాల జీర్ణోద్ధరణ పనులు వివిధ దశల్లో ఉన్నాయి. నిరాదరణకు గురైన ఆలయాల్లో ధూపదీప నైవేద్యాల కోసం ప్రతినెలా ఆలయ కమిటీ బ్యాంకు అకౌంట్‌లో రూ.5 వేలు జమ చేయాలని మా పాలకమండలి నిర్ణయించింది. శ్రీవాణి ట్రస్టుకు ప్రత్యేకంగా బ్యాంకు అకౌంటు ఉంది. అందులోనే విరాళాలు జమ అవుతాయి. టీటీడీ నుండి ఒక రూపాయి కూడా పక్కదారి పట్టే ప్రసక్తే లేదు. శ్రీవాణితోపాటు ఇతర ఏ ట్రస్టుల్లో అయినా అవినీతి జరుగుతోందనే అనుమానం ఉంటే ఎవరైనా వివరాలు తెలుసుకోవచ్చు. ఈ విషయంపై 2023 జనవరి 23వ తేదీ ఈవో ఎవి ధర్మారెడ్డి మీడియా సమావేశం నిర్వహించి శ్రీవాణి ట్రస్ట్ నిధులు, ఈ నిధులతో నిర్మిస్తున్న, నిర్మించిన, నిర్మించబోయే ఆలయాల వివరాలు పూర్తిగా వివరించారు. అయినా కొందరు పదే పదే ఆరోపణలు చేయడం శోచనీయం. శ్రీవాణి టికెట్ తీసుకునే భక్తులకు ట్రస్టుకు విరాళం కింద రూ.10 వేలకు, దర్శనం టికెట్ కోసం రూ.500కు రెండు రసీదులు ఇస్తున్నాం. ఆన్‌లైన్‌లో ఈ టికెట్ బుక్ చేసుకున్నా రెండు రసీదులు వస్తాయి. రూ.500/-కు మాత్రమే రసీదు ఇచ్చి మిగిలిన రూ.10 వేలు దోచుకుంటున్నారని కొందరు వ్యక్తులు రాజకీయ, వ్యక్తిగత లబ్ధి కోసం ఆరోపణలు చేస్తున్నారు. ఇలాంటి వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## టీటీడీ పాలకమండలి సమావేశం, కీలక నిర్ణయాలు....

- పోలీస్ క్వార్టర్స్ నిర్మాణం కోసం రూ.3.5 కోట్లు కేటాయింపు.
- వేదిక్ యూనివర్శిటిలో స్టాఫ్ క్వార్టర్స్ నిర్మాణం కోసం రూ.5 కోట్లు కేటాయింపు.
- టీటీడీలో కంప్యూటర్లు ఆధునీకరణ కోసం రూ.7.4 కోట్లు కేటాయింపు.
- టీటీడీ పరిపాలన భవనంలో సెంట్రలైజ్డ్ రికార్డు సెంటర్ ఏర్పాటుకు రూ.9.4 కోట్లు కేటాయింపు. - స్విమ్స్ హస్పిటల్స్ ఆధునీకరణ కోసం రూ.95 కోట్లు కేటాయింపు.
- తిరుమలలో ప్లాస్టిక్ బదులుగా స్టీల్ డస్ట్ బిన్స్ ఏర్పాటుకు రూ.3.1 కోట్లు కేటాయింపు.
- తిరుచానురు పద్మావతి అమ్మవారి పుష్కరిణిలో ఇత్తడి గ్రీల్స్ ఏర్పాటుకు రూ.6.5 కోట్లు కేటాయింపు. - తిరుపతిలో రామానుజా సర్కిల్ నుంచి రేణిగుంట వైపు బిటి రోడ్డు నిర్మాణంకు రూ.5 కోట్లు కేటాయింపు. - నగరి నియోజకవర్గం బుగ్గ గ్రామంలో కళ్యాణమండప నిర్మాణంకు రూ.2 కోట్లు కేటాయింపు.
- కర్నూల్ జిల్లా ఆవుకు గ్రామంలో ఆలయ నిర్మాణంకు రూ.4 కోట్లు కేటాయింపు.



విజయభాను

## సంపాదకీయం


### ఆచరణాత్మకంగా కొనసాగాలి

'ఆడుదాం ఆంధ్రా' పేరిట 46 రోజుల పాటు క్రీడా సంబరాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. క్రీడాభివృద్ధికి తగిన కృషి చేస్తామని ప్రకటించింది. ఇది స్వల్ప కాలపు సంబరాలూ, ఆడంబరాలకే పరిమితం కాకుండా ఆచరణాత్మకంగా కొనసాగాలి. ఆడడం, పాడటం అనేది మనిషి సహజమైన స్వభావం. పిల్లల్లో ఇది ఎక్కువగా ఉంటుంది కాబట్టి, ఆటల పట్ల అమితాసక్తి చూపిస్తారు. ఆటల వల్ల ఆరోగ్యం, ఆనందం రెండూ ఒనకూడతాయి. వ్యక్తిత్వ వికాసానికి అవసరమైన తొలి పాఠాలు మైదానంలోనే పరిచయం అవుతాయి. అభిరుచులకు తగ్గ స్నేహాలు అక్కడే మొగ్గ తొడుగుతాయి. ఆరో తరగతి అబ్దుల్లాకు, ఏడో తరగతి ఏకాంబర శర్మకు ఆటస్థలంలోనే చెలిమి కుదురుతుంది. కబడ్డీలో గాయపడ్డ కరణ్‌సింగ్‌కు సపర్యలు చేసే సావకాశం అక్కడే సాధ్యమవుతుంది. ఎగిరెగిరి వస్తున్న వాలీబాల్‌ను ఎప్పుడు ఎత్తి కొట్టాలో, ఎప్పుడు దించి నొక్కాలో ఒక వ్యూహం. బరిలో ఒంటరిగా ఉన్నప్పుడు ఎలా ఉండాలో, జట్టుగా ఉన్నప్పుడు ఎలా వ్యవహరించాలో కబడ్డీ ఒక కర్తవ్య బోధ. తోటివారిని అందుకోవడం, అందించటం ఖోఖోలో ఒక అప్రమత్త విద్య. ఇలా ఆట ఏదైనా అందులో మనకు పనికొచ్చే పాఠం ఒకటి ఉంటుంది. సమన్వయం, సహకారం, సమిష్టితత్వం, ఆచితూచి వ్యవహరించటం, అప్రమత్తంగా ఉండడం, అంచనా వేయడం ... వంటి జీవన నైపుణ్యాలు ఆటల ద్వారా అలవడతాయి.

ఆటపాటల మధ్య చదువు నేర్పించాలి అనేది అందరూ అంగీకరించే మాటే ! పిల్లలు ఆడుకోవాలి అంటే - పాఠశాలల్లో కచ్చితంగా ఆట స్థలం ఉండాలి. ఆట వస్తువులు అందుబాట్లో ఉండాలి. ఆడించే ఉపాధ్యాయులు ఉండాలి. ఈ అన్నింటిలోనూ మన ప్రభుత్వాల ఆచరణ అధ్వానస్థితిలో ఉంది. మన దేశంలో ఆటస్థలాలు ఎక్కువగా ఉన్న రాష్ట్రం పంజాబ్. అక్కడ గ్రామీణ క్రీడలు ఇప్పటికీ ఇంతలా వర్ధిల్లటానికి అదొక కారణం. తరువాతి స్థానాల్లో చండీగఢ్, మహారాష్ట్ర ఉన్నాయి. ఒక లెక్క ప్రకారం ... మనదేశంలో 56.58 శాతం పాఠశాలలకు ఆటస్థలాలు ఉన్నాయి. హర్యానా, ఢిల్లీ, కేరళ, ఉత్తరప్రదేశ్, తమిళనాడులో జాతీయ సగటు కన్నా ఎక్కువ ఆటస్థలాలు ఉన్నాయి. ఈ రాష్ట్రాల నుంచే వివిధ క్రీడల్లో ఎక్కువమంది తర్ఫీదు పొంది వస్తున్నారు. దక్షిణ భారతదేశంలో తక్కువ స్కూలు ప్లే గ్రౌండ్సు ఉన్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. కార్పొరేట్ విద్యాసంస్థల కాగితపు లెక్కలతో సహా 54.95 శాతం పాఠశాలల్లో మాత్రమే ఆటస్థలాలు ఉన్నాయి. ఇది జాతీయ సగటు కన్నా తక్కువ. పైగా ఉన్న వాటిని కూడా వివిధ నిర్మాణాల పేరిట నిర్వీర్యం చేస్తున్న పరిస్థితి గత ప్రభుత్వంలోనూ ఉంది. ఇప్పుడూ కొనసాగుతోంది. ఇక ప్రయివేటు, కార్పొరేటు స్కూళ్ల పరిస్థితి మరీ దారుణం. కోళ్ల ఫారాల లాంటి ఇరుకిరుకు భవనాల్లో అనేక ప్రయివేటు, కార్పొరేటు విద్యాసంస్థలు నడుస్తున్నాయి. నిబంధనల కోసం స్కూలుకు దగ్గరగా ఉన్న ఏ ఖాళీ స్థలాన్నో మైదానంగా చూపించి అనుమతులు పొందుతున్నారు. అయినా, అధికారులు చూసీ చూడనట్టు వదిలేస్తున్నారు. ఆటల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిన్నచూపునకు ఇదొక నిదర్శనం.

పిల్లలకు ఆటలు వేరు.. చదువు వేరు... అని అనుకోవటమే పెద్ద పొరపాటు. పిల్లలను అన్ని విధాలా తీర్చిదిద్దడంలో ఆటలు కీలకపాత్ర పోషిస్తాయి. కిక్కిరిసిన గదుల్లో ఎక్కించే పాఠాల నుంచి పిల్లలకు రిలీఫ్‌నిస్తాయి. పేరుకుపోతున్న ఒత్తిడిని దూది పింజలా ఎగరగొడతాయి. పాఠాలను అర్థం చేసుకునే బలాన్నిస్తాయి. గెలుపోటములు సహజమనే జీవిత సత్యాన్ని ప్రబోధిస్తాయి. కులమతాలకు, భాష, ప్రాంతం వంటి భావాలకు అతీతంగా సమైక్యత, సమభావం ఆటల ద్వారా అలవడతాయి. అందుకే ఆటలు చదువులో ఒక భాగం కావాలి. రాష్ట్ర ప్రభుత్వం 'ఆడుదాం ఆంధ్రా'ను కొన్ని రోజుల సందడికే పరిమితం చేయకుండా, వ్యవస్థాగతమైన ఏర్పాట్లతో నిరంతర కృషి కొనసాగించాలి. అన్ని పాఠశాలల్లోనూ ఆటలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాలి. వ్యాయామ ఉపాధ్యాయులను నియమించి, ఆటలను కరికులంలో కచ్చితంగా భాగస్వామ్యం చేయాలి. విజేతలైన ఒకరో, ఇద్దరో క్రీడాకారులను భారీ సన్మానాలూ, కానుకలతో ముంచెత్తటం కాదుబీ వేలాది మంది క్రీడాకారులు పాఠశాల మైదానాల నుంచి పుట్టుకొచ్చేలా చూడాలి! అదే అసలు సిసలు క్రీడాభివృద్ధి అవుతుంది.

## విశాఖ శారదాపీఠాన్ని సందర్శించిన తాండూరు ఎమ్మెల్యే



పెందుర్తి (విజయభాను న్యూస్) : తెలంగాణ రాష్ట్రం వికారాబాద్ జిల్లా తాండూరు ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి సోమవారం విశాఖ శ్రీ శారదాపీఠాన్ని సందర్శించారు. రాజశ్యామల అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతీ స్వామిని కలిసి ఆశీస్సులు అందుకున్నారు. వచ్చే నెల 3వ తేదీన తాండూరులో తలపెడుతున్న రాజశ్యామల యాగం నిర్విఘ్నంగా సాగేలా దీవించాలని స్వరూపానందేంద్ర స్వామిని కోరారు. భీమిలి ఎమ్మెల్యే అవంతి శ్రీనివాస్ కూడా విశాఖ శారదాపీఠాన్ని సందర్శించారు. 21వ తేదీన చాతుర్మాస్య దీక్ష కోసం స్వరూపానందేంద్ర స్వామి రిషికేష్ బయలుదేరుతున్న నేపథ్యంలో ఆయన నుంచి ఆశీస్సులు అందుకున్నారు.

## తిరుపతిలో ఘనంగా విశాఖ మేయర్ జన్మదిన వేడుకలు



తిరుపతి /విశాఖపట్నం(విజయభాను న్యూస్): మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి జన్మదిన వేడుకలు సోమవారం తిరుపతిలో ఘనంగా నిర్వహించారు. తిరుపతి నగరపాలక సంస్థ 11వ వార్డులో కార్పొరేటర్ శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో కార్పొరేటర్లు తిరుమలరెడ్డి మహేష్ రెడ్డి ఇతర కార్పొరేటర్లు వైయస్సార్సీపి కార్యకర్తల సమక్షంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ నా జన్మదిన వేడుకలు తిరుపతిలో కార్పొరేటర్లు, వైఎస్ఆర్సిపి కార్యకర్తల మధ్య జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ ఏర్పాటు చేసిన వైఎస్ ఆర్సిపి కార్పొరేటర్లకు కార్యకర్తలకు మేయర్ కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో పార్టీ కార్యకర్తలు ప్రజా ప్రతినిధులు సమిష్టిగా కృషి చేసి ప్రజలతో మమేకమై పార్టీ విజయానికి కృషి చేస్తామని రానున్న ఎన్నికల్లో సంపూర్ణ మెజార్టీతో పార్టీ విజయం సాధిస్తుందని జోష్యం చెప్పారు.

## స్వాత్మానందేంద్ర ఆశీస్సులు అందుకున్న భారత క్రికెటర్



గోపాలపట్నం (విజయభాను న్యూస్) :భారత క్రికెట్ జట్టు ఆటగాడు కేఎస్ భరత్ సోమవారం విశాఖ శ్రీ శారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామిని కలిసారు. చాతుర్మాస్య దీక్ష కోసం విశాఖ నుంచి రిషికేష్‌కు బయలు దేరిన స్వాత్మానందేంద్ర స్వామిని ఎయిర్‌పోర్టులో కలిసి ఆశీస్సులు అందుకున్నారు. క్రికెటర్ కేఎస్ భరత్ రాజశ్యామల అమ్మవారి అనుగ్రహం, పీఠాధిపతుల ఆశీస్సుల కోసం విశాఖ శారదాపీఠాన్ని తరచూ సందర్శిస్తుంటారు. చాతుర్మాస్య దీక్ష కోసం పీఠాధిపతులు రిషికేష్ వెళ్ళి మూడు నెలలు అక్కడే ఉంటారన్న సమాచారంతో కేఎస్ భరత్ స్వాత్మానందేంద్ర స్వామిని కలిసారు. ఇదిలా ఉండగా స్వాత్మానందేంద్ర స్వామి 23వ తేదీ వరకు ఢిల్లీలో ఉంటారు. అక్కడి నుంచి హర్యానా వెళ్ళి 26వ తేదీకి రిషికేష్ చేరుకుంటారు.

## సినీ ఆర్టిస్టులకు హెల్త్ కార్డ్ ల పంపిణీ

విశాఖపట్నంకు ఫిల్మ్ ఇండస్ట్రీ తరలిరావాలి

ప్రభుత్వం తరపున రాయితీలు,ప్రోత్సాహకాలు కల్పిస్తాం

ఏపీ మా గౌరవ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్




డాబాగార్డెన్స్ (విజయభాను న్యూస్): డాబా గార్డెన్స్ దగ్గర లో గల అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వ ర్యంలో హెల్త్ కార్డ్ లును సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ (ఏపీ మా) గౌరవ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్ మాట్లాడుతూ ప్రకృతి అందాలకు నిలయమైన విశాఖ కు ఫిల్మ్ ఇండస్ట్రీ తరలిరావాలని సీఎం జగన్మోహన్ రెడ్డి పలు రాయితీలు, ప్రోత్సాహకాలు కల్పిస్తున్నారని తెలిపారు. సినీ పరిశ్రమకు అనువైన ప్రదేశం గా ఎంతో ఘనచరిత్ర కలిగిన మన విశాఖను సినిమా హబ్ కు నిలయమని అన్నారు. అనంతరం తోరం రాజ ఏర్పాటు చేసిన హెల్త్ కార్డను పలువురు ఆర్టిస్టులకు వంశీ, చైర్మన్ చేతులమీదుగా అంద జేశారు.

కార్యక్రమంలో చైర్మన్ శ్రీనివాస్ నాయుడు, మురళి, వర్మ, సురేష్ ,జెటీ రామారావు,వాసు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# భవిష్యత్తు గ్యారంటీ జనరల్ బాడీ సమావేశంలో పాల్గొన్న మాజీ మంత్రి కోండ్రు



రాజాం (విజయభాను న్యూస్) : తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయం మంగళగిరిలో మాజీ ముఖ్యమంత్రి తెలుగుదేశం జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన నిర్వహించిన భవిష్యత్తుకు గ్యారెంటీ అనే కార్యక్రమం జనరల్ బాడీ సమావేశంలో పాల్గొన్న మాజీ మంత్రి రాజాం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జి కోండ్రు మురళీ మోహన్,40 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన పార్టీ తెలుగుదేశం పార్టీ అన్నారు,రాష్ట్రాన్ని అన్నివిధాలా సర్వనాశనం చేసిన పార్టీ వైసీపీ పార్టీ అన్నారు,వైసీపీ నిత్యావసర వస్తువుల ధరలు అమాంతం పెంచి ప్రజల నడ్డివిరిచారన్నారు,వైసీపీ ప్రభుత్వం ప్రజా స్వేచ్ఛను హరించి రాష్ట్రాన్ని గంజాయి హబ్ గా మార్చారన్నారు,ఏపీలో నేరస్తుల పరిపాల జరుగుతోందని, గతంలో ఎన్నడూచూడని అరాచకాలు జరుగుతున్నాయని,4ఏళ్లలో వ్యవస్థను వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నాశనం చేశారని దుయ్యబట్టారు,

అనంతరం తెలుగుదేశం జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు భవిష్యత్తు గ్యారంటీ ప్రచార రథాలు ప్రారంభ కార్యక్రమంలో కోండ్రు పాల్గొన్నారు,మహానాడు వేదికగా రూపకల్పన చేసిన తెదేపా మానిఫెస్టో ను ప్రతీ పట్టణ గ్రామీణ ప్రాంతాల కు బలంగా తీసుకెళ్లాలని సూచించారు,2024 కంటే ముందుగా ఎన్నికలు వచ్చినా ఆశ్చర్య పోనక్కర్లేదని నాయకులు సంసిద్ధంగా ఉండాలన్నారు,భవిష్యత్తుకు గ్యారంటీ చైతన్య రథాలు రేపటి నుండి 25 రోజులపాటు 125 నియోజకవర్గాల్లో తిరగనున్నాయన్నారు.



# జగనన్న ఆణిముత్యాలు అందజేత




భీమునిపట్నం: విజయభాను న్యూస్ : స్థానిక మున్సిపల్ హైస్కూల్ లో సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు చెట్టి. సింహాచలం అధ్యక్షతన జగనన్న ఆణి ముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా పాఠశాలలో ప్రథమ స్థానం పొందిన ఎ. విజయ (565/600) కు జగనన్న పంపించిన 3000/-, ద్వితీయ స్థానం పొందిన వై. అనిత (531/600) కు 2000/- రూపాయలు, తృతీయ స్థానం పొందిన ఎమ్. త్రిలోచన (529/600) కు 1000/- రూపాయలు ప్రధానోపాధ్యాయుల వారి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ జగనన్న ఆణిముత్యాలు అనే కార్యక్రమం అపురూప మైనదని అత్యుత్తమైనదని అద్భుతమైనదని తెలియజేశారు. విద్యార్థులను ఈ విధంగా ప్రోత్సహించడం ద్వారా ప్రస్తుతం 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఇన్స్పిరేషన్ గా ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు నయీం, సుజాత కుమారి, అల్లాడ. శ్రీనివాసరావు, వెంకట్రావు, ఏ. రామకృష్ణ, ఎం. రామకృష్ణ, అశోక్ వై.వి. రవికుమార్ లు పాల్గొన్నారు.

# భీమవరం అంగన్వాడీ కేంద్రం లో జనాభాగీదారి కార్యక్రమం



అనంతగిరి, విజయభాను న్యూస్ : భీమ వరం అంగన్వాడీ కేంద్రం లో జనాభాగీ దారి కార్యక్రమం, నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో డిపార్ట్మెంట్ ద్వారా అందిస్తున్న పి పి 1, పి పి 2,ద్వారా మరియు ఆటపాటలు ద్వారా అందించే విద్య పై తల్లితండ్రులకు అవగాగానా కల్పించడమైనది ఆటపాటలు ద్వారా పిల్లల్లో కలిగే అభివృద్ధి గురించి ఉవరించడమైనది అనంతరం 6 సంవత్సరాలు పూర్తి అయిన పిల్లలకు గ్రాడ్యుయేషన్ డే మరియు 3 సంవత్సరాలు పూర్తి అయినా పిల్లలకు అక్షరాబ్యాసం చేసి ప్రెస్కూల్ లొ జాయిన్ చేసుకోవటం జరిగింది అనంతరం జనాభాగిదారి ర్యాలీ నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమం లో సెక్టార్ సూపర్ వైజర్, శ్యామల కుమారి, పాఠశాల ఉపాద్యాయులు అంగన్వాడీ కార్యకర్త హెల్పర్ గర్భిణీలు, బాలింతలు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

## ఏజెన్సీలో మైదాన ప్రాంత ఉపాధ్యాయులకు బదిలీలు రద్దు చేయాలి

### జీఓ నంబర్ 3 చట్టబద్దత కల్పించాలని గిరిజన సంఘం డిమాండ్

అరకులోయ (విజయభాను న్యూస్) పాడేరు ఏజెన్సీ ప్రాంతం లో మైదాన ప్రాంత ఉపాధ్యాయాలకు బదిలీ రద్దు చేయాలనీ తహసిల్దార్ కు వినతి పత్రాన్ని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లోసురెంద్ర,జిల్ల కార్యదర్శి పి. బలదేవ్.మండల కార్యదర్శి పి.రామన్న అధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఆనంతరం విలేఖరుల సమావేశంలో ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడుతు పాడేరు ఏజేన్సీలో 400 మంది ఎస్.జీ.టి పోస్టులు మైదనా ప్రాంత ఉపాధ్యాయులకు నియమకాలు వెంటనే రద్దు చెయ్యాలనీ జీఓ 3 సుప్రీం కోర్టులో పిటిషన్ నడుస్తుండగా రాష్ట్ర ప్రభుత్వాలు ఏజెన్సీ లో మైదానప్రాంత ఉపాధ్యాయులు. నియామకాలు వెంటనే నిలుపుదల చేయాలని,జీఓ 3 అను గుణంగా బదిలీ ప్రక్రియ కొనసాగించాలని జీఓ 3 కు చట్టబద్దత కల్పించాలని ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్ చేస్తుం దన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘము మండల అధ్యక్షులు జీ. బుజ్జిబాబు మండల నాయకులు టి.హరి. కే.జగన్నాధం పాల్గొన్నారు.

# ఆర్థిక సహాయం అందజేత



అక్కయ్యపాలెం, విజయభాను న్యూస్ : విశాఖ దక్షిణ నియోజకవర్గం 35వ వార్డు టౌన్ కొత్త రోడ్డు ప్రాంతంలో రాత్రి కురిసిన భారీ వర్షము లకు ఉరుములు మెరుపులకు పాత బిల్డింగ్ అయిన రెండు అంతస్తుల మేడ కూలిపోవడం జరిగింది కూలిపోయిన మేడలో నివాసం ఉంటున్న తండ్రి కొడుకులు నాగరాజు ప్రవీణ్ వారి అల్లుడు మధు ఉన్నారు వారి కి భౌతికంగా దెబ్బలు తగలడం జరిగినది ఈ విషయం తెలిసిన 35 వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు వెంటనే త్వరితగతిన సంఘటనా స్థలం చేరుకొని స్థానిక ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ కి విషయం తెలియపరచి ఆ కుటుంబానికి బాధితులకు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ చేతుల మీదుగా ఆర్థిక సహాయం అందించడం జరిగి నది.

అలాగే దెబ్బలు తగిలిన వారికి కేజీహెచ్ లో ప్రధమ చికిత్స అత్యవసర చికిత్స ఏర్పాటు చేసి కేజీహెచ్ సూపర్నెంట్ కి దగ్గరుండి చూసుకోమని మెరుగైన వైద్యం అందించాలని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో 35వ వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు శ్రేయోభి లాషులు కన్వీనర్లు పాల్గొన్నారు.

# బిఏ , బీకాం మరియు బీఎస్సీ గ్రూపుల్లో అడ్మిషన్స్ కు జూన్ 19 నుండి 24 వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

భీమునిపట్నం, విజయభాను న్యూస్ : స్థానిక ఎస్వీఎల్ఎన్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023- 24 విద్యా సంవత్సరానికి బిఏ, బీకాం మరియు బీఎస్సీ గ్రూపుల్లో అడ్మిషన్స్ కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ మంజుల తెలిపారు. ఇంటర్మీడియట్ తత్సమాన విద్యార్హత కలిగిన అభ్యర్థులు డిగ్రీలో ప్రవేశానికి అర్హులు అన్నారు. జూన్ 19 నుండి 24 వరకు ఆన్లైన్ లో రిజిస్ట్రేషన్ చేయించుకొని ఈనెల 26 నుండి 30 వరకు వెబ్ ఆప్షన్స్ ఎంపిక చేసుకోవాలన్నారు. విద్యార్థులు సౌకర్యార్థం అప్లికేషన్ ఆన్లైన్ రిజిస్ట్రేషన్ కొరకు కళాశాలలో ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామన్నారు. కళాశాలలో చేరదలుచుకున్న విద్యార్థులు పదవ తరగతి మరియు ఇంటర్మీడియట్ మార్క్స్ మెమోలు, ఆరవ తరగతి నుండి స్టడీ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, విద్యార్థి యొక్క ఆధార్, పాస్పోర్ట్ సైజ్ ఫోటో తో కళాశాలకు వచ్చి లేదా మీ దగ్గరలో ఉన్న నెట్ సెంటర్స్ లో ఆన్లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.మరిన్ని వివరాలకు9246639197,9989937370,9948632130 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

# గాంధీ విగ్రహ ఆవిష్కరణ



రాజాం (విజయభాను న్యూస్) : రాజాం పట్టణానికి చెందిన కొత్త అనంత రావు,చంద్రావతి, టి.కోశల దాతృత్వంతో , రాజాం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో జాతిపిత మహాత్మగాంధీ విగ్రహఆవిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్త అనంతరావు మాట్లాడుతూ విద్యార్థులు పెద్దలను గౌరవించాలని ,క్రమశిక్షణతో, సత్ప్రవర్తనతో జీవించాలని,గాంధీజి సిద్ధాంతా లను, ఆశయాలను కొనసాగించాలని,అందరికీ ఆదర్శం గా జీవించాలని హిత బోధ చేశారు. పాఠశాల ఎన్సీసీ విద్యార్థులు మార్చ్ పాస్ట్ చేసి జాతి పిత కి గౌరవ వందనం చేశారు. భారత్ మాత కి జై అని నినాదాలు చేశారు.ఈ కార్యక్రమం లో రాజాం ఓల్డ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శి లు కొత్త సాయి ప్రశాంత్ కుమార్, బీ వి అత్యుత్ కుమార్ , జాతీయ యువజన అవార్డు గ్రహీత పెంకి చైతన్య కుమార్, బి. శంకర రావు, సీ హెచ్ సత్యనారాయణ, ఎన్ షర్మిలరాణి, డి.శ్రీను, గౌరిప్రసాద్, పండూరు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బొద్దపు జన్మదిన వేడుకలు

## గజమాలతో సత్కరించిన పెద్ద చెరువు ఆయకట్టుదారుల సంఘం ప్రెసిడెంట్ రెడ్డి



పరవాడ (విజయభాను న్యూస్) : మండల కేంద్రమైన పరవాడ సినిమాలు జంక్షన్ లో గల వైసిపి నాయకులు బోద్ధపు అయ్యబాబు జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి.. ముందుగా ఈయన్ను పెద్ద చెరువు ఆయకొట్టు దారుల సంఘం ప్రెసిడెంట్ రెడ్డి శ్రీనివాస రావు, రాజన్న సత్యం, బోండా శ్రీనివాసరావు, పైల నారాయణమూర్తి తదితరులు గజమాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియ పరిచారు... ఈ సందర్భంగా రెడ్డి శ్రీనివాసరావు మాట్లాడుతూ మొద్దబ్బాయి బాబు ఇటువంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని రానున్న రాజుల్లో ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆయన ఆకాంక్షించారు.. ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు పైడిమాంబ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# మంచినీరు కోసం 8 నెలల నిండు గర్భిణీ స్త్రీ కాలి నడక

**మా గ్రామంలో మంచినీరు సమస్య పై పట్టించుకోని రాజకీయ నాయకులు,,ప్రభుత్వ అధికారులు**



**మహిళలూ రెండువైపులా 3 కిలోమీటర్లు కాలినడకన తల పై మంచినీరు మోసుకొస్తున్న దృశ్యం**

అనంతగిరి విజయభాను. న్యూస్ : అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం గరుగుబిల్లి పంచాయతీ లో చినపూతికవలస గ్రామంలో నిత్యం మంచినీటి సమస్యతో చాలా బాధ పడు తున్నారు.గుక్కెడు మంచినీరు లేక గ్రామస్తులు ప్రతి నిత్యం ఆందోళన చెందుతున్న పట్టించుకొనే వారే లేరు ఎన్ని సార్లు ప్రజా ప్రతినిధులకు, ప్రభుత్వ అధికారులకు సమస్యను విన్నవించినా తూతు మంత్రంగా వ్యవహరించి సమస్యను గాలికి వదిలేస్తున్నారు. మా గ్రామంలో మంచినీరు లేక ప్రైవేట్ భూ యజమానికి బ్రతిమాలుకుంటు సైటు నుంచి చాలా దూరం కాలినడకన వెళ్లి రెండువైపుల సుమారు 3 కిలోమీటర్లు ,నిండు గర్భిణీ స్త్రీ,మహిళల వృద్ధులు, ప్రతి ఇంటి నుండి తల పై మోసుకుంటూ వస్తున్నాం.

గ్రామ సచి వాలయంలో...

పంచాయతీ కార్య దర్శి అందుబాటులో ఉండక మా సమస్యను ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి ప్రజాప్రతినిధులు, ప్రభుత్వాధికారులు ఇప్పటికైన మా చిన పూతిక వలస గ్రామం లో మంచి నీరు సమస్యను పరిష్కరించకపోతే సచి వాలయం వద్ద ధర్నా చేస్తాం.

# రేపు విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

భీమునిపట్నం : విజయభాను న్యూస్ : భీమిలి మండలం లోని విద్యుత్ వినియోగదారులు తమ సమస్యల పరిష్కారానికి ఈ నెల 21 న భీమిలి డిప్యూటీ ఎక్జిక్యూటివ్ ఇంజనీర్ వారి కార్యాలయం లో నిర్వహించే సదస్సును సద్వినియోగ పర్చుకోవాలని,

ఈ నెల 21 న భీమిలి లో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమంలో విద్యుత్ వినియోదారుల ఫోరమ్ చైర్ పర్సన్, డాక్టర్ బి. సత్యనారాయణ, ఎస్. సురేష్ బాబు,మెంబర్ టెక్నికల్, ఎస్. హరి బాబూ మెంబర్ ఫైనాన్స్, డాక్టర్ ఈ.సురేంద్ర కుమార్, మెంబర్ఇండిపెండెంట్, రొంగలి రమేష్ డి ప్యూటీ ఎక్జిక్యూటివ్ ఇంజనీర్ భీమిలి, మండల అధికారులు శ్ యు. శంకరయ్య, బొట్ట రవి,. జె.రాము అధ్వర్యంలో జరుగుతుందన్నారు. ఉదయం 10 గం. నుండి 1 గంట వరకు జరిగే ఈ సదస్సుకు వినియోగ దారులు హాజరై తమ సమస్యలను తెలియ జేసుకోవాలని విద్యుత్ అధికారులు సూచించారు.

# జీ అడ్వాన్స్ లో సత్తా చాటిన శశి కళాశాల విద్యార్థులు

భీమునిపట్నం : విజయభాను న్యూస్ : జీ అడ్వాన్స్ లో సంగివలస శశి కళాశాలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించినట్లు శశి విద్యాసంస్థలు చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాల్ కృష్ణ,వైస్ చైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కేటగిరిలలో యస్. రామ హర్షిణి ఆలిండియా 11 వ ర్యాంక్,ఆర్.సాయి నారా యణ 118 వ ర్యాంక్,కె.అభిరామ్ 152, వి.ఎస్.ఎస్. గణ్వంత్ 235,వి.రాజ్ కుమార్ 504, ఆర్.ఎన్.వి కృష్ణ 751,పి.సాయిరామ్ 802,వి.ఆనంద్ భాస్కర్ 866,బి.కావ్య 991,ఎం.హెచ్.ఎన్.డి సతీష్ 1135,డి.వి.వి చైతన్య 1210 ర్యాంక్ లు సాధించినట్లు చెప్పారు. అంతేకాకుండా ఓపెన్ కేటగిరి లలో1000 లోపు 2, 5000 లోపు 4,10,000 లోపు 10 ర్యాంకులు వచ్చాయనీ అన్నారు.

వివిధ కేటగిరిలలో1000 లోపు 9,5000 లోపు 35,10000 లోపు 46 ర్యాంక్ లు సాధించినట్లు చెప్పారు.

ర్యాంక్ లు విద్యార్థినీ,విద్యార్థులను శశి విద్యా సంస్థల చైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ, అకడమిక్ డైరెక్టర్ మేకా క్రాంతి సుధ అభినందించారు.

# నేడు టౌన్ కొత్త రోడ్డు శ్రీ జగన్నాథుని రథోత్సవం

### వచ్చే నెల జూలై 1 వరకు రథయాత్ర మహోత్సవాలు కొనసాగింపు

### ఘనంగా పూర్ణాహుతి, జగన్నాథునికి నేత్రోత్సవం, సాయంత్రం కళ్యాణం నిర్వహణ

అక్కయ్యపాలెం (విజయభాను న్యూస్) : టౌన్ కొత్త రోడ్లో ఉన్న దేవదాయ ధర్మదాయశాఖకు చెందిన శ్రీ జగన్నాథస్వామి తొలి రథోత్సవం ఈనెల 20న మంగళవారం సాయంత్రం 5 గంటలకు అంగరంగ వైభవంగా దేవస్థానం నుండి మేళ తాళములు, బాణాసంచాలు, మంగళ వాయుద్యములు, భక్తులు సమక్షంలో జగన్నాథనామ స్మరణలతో వేదపండితుల పారాయణాలతో అత్యంత వైభవోపేతంగా తొలి రథయాత్ర మహోత్సవము నిర్వహిస్తున్నట్లు దేవస్థానం కార్యనిర్వహణ అధికారి టి.రాజగోపాలరెడ్డి తెలియజేశారు. ఈ సందర్భంగా సోమవారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రథయాత్ర మహోత్సవాల వివరాలను వెల్లడించారు. జగన్నాథుని వార్షిక కళ్యాణం, రథయాత్ర మహోత్సవాలు ఈ నెల19 నుంచి ప్రారంభమైందని జూలై 1 వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. శోభకృత్ నామ సంవత్సర జ్యేష్ఠ బహుళ చతుర్దశి ఈ నెల 17 న శనివారం నుండి ఆషాఢ శుద్ధ త్రయోదశి వచ్చేనెల జులై 1 తేదీ వరకు జగన్నాథ స్వామి కళ్యాణం, రథయాత్ర మహోత్సవములు జరుపుటకు దైవ నిర్ణయం జరిగినట్లు పేర్కొన్నారు. జగన్నాథ స్వామి కి సోమవారం ఆషాఢ శుద్ధ పాడ్యమి ఉదయం పూర్ణాహుతి, నేత్రోత్సవము నిర్వహించినట్లు తెలిపారు.సాయంత్రం ధ్వజావరోహణం సాయంత్రం 6-30 లకు ప్రతిష్టాంత సుభద్రాదేవి శాంతి కళ్యాణం నిర్వహించ నున్నట్లు తెలిపారు. తొలి రథయాత్ర 20 న, తిరుగు రథయాత్ర 30 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.వైదిక కార్యక్రమ వివరములు ఆయన తెలియజేస్తూ ఈ నెల 17 శనివారం జ్యేష్ఠ బహుళ చతుర్దశి సాయంత్రం ప్రతిష్ఠా ప్రారంభ సంకల్ప కార్యక్రమం నిర్వహించినట్లు పేర్కొన్నారు.18 ఆదివారం అమావాస్య ఉదయం జలాధివాసములు, క్షీరాధివాసములు రాత్రి విశేష హోమములు, పంచశయ్యాది వాసములు నిర్వహించినట్లు తెలిపారు.20 తేదీ మంగళవారం ఆషాఢ శుద్ధ విదియ ఉదయం 7.35 గంటలకు శ్రీ జగన్నాథ స్వామిని రథం పై అధిష్ఠించడం జరుగుతుందన్నారు. ఆరోజు 5 గంటలకు జగన్నాథస్వామి తొలి రథయాత్ర ఉత్సవములు కన్నుల పండుగా నిర్వహిస్తామని తెలిపారు. 21 బుధవారం నుండి 29 గురువారం వరకు టర్నర్ సత్రం కళ్యాణ మండపములో జగన్నాథ స్వామి దశావతారములలో భక్తులకు దర్శన మిస్తారని తెలియ జేశారు. జగన్నాథ స్వామి 21 న మత్స్యా వతారము, 22 న కూర్మావతారం, 23 వరాహా వతారము, 24 నృసింహావతారము, శిలవిరుపు మహోత్సవము, లక్ష్మీదేవి తిరు వీధి ఉత్సవము, 25 న వామనావతారము, 26 న పరశురామావతరము, 27 న శ్రీ రామావతారము, 28 న బలరామ, శ్రీ కృష్ణావతారము, 29 న తొలి ఏకాదశి శేషపాన్పు అవతారం, 30న జగన్నాథ స్వామి తిరుగు రథయాత్ర కార్యక్రమంలో భాగంగా ఆరోజు ద్వాదశి శుక్రవారం ఉదయం 10 కి శ్రీ జగన్నాథ స్వామి వారు రథంపై అధిష్టానం చేసి భక్తులకు దర్శనం కలిగిస్తామన్నారు. సాయంత్రం 5 గంటలకు జగన్నాథ స్వామి టర్నరు సత్రం కళ్యాణ మండపం నుండి మేళ తాళములు, బాణాసంచాలు, మంగళ వాయుద్యములు, భక్తులు సమక్షంలో జగన్నాథనామ స్మరణలతో వేదపండితుల పారాయణాలతో అత్యంత వైభవోపేతంగా తిరుగు రథయాత్ర మహోత్సవము కొత్తరోడ్లో ఉన్న శ్రీ జగన్నాథ స్వామి ఆలయము వరకు జరుగు తుందన్నారు. తదుపరి శ్రీ స్వామి వారి అమ్మవారి సంవాదము జరుగునన్నారు. తదుపరి జగన్నాథ స్వామిని దేవస్థానంలో ప్రవేశపెట్టి వచ్చేనెల జూలై 1న శనివారం ఉదయం సంప్రోక్షణ, పీఠారోహణం స్వామిని యధాస్థానమున అధిష్టిస్తామని తెలిపారు.భక్తులకు ఉచిత దర్శనముతోపాటు ప్రత్యేక దర్శనము 20 రూపాయలు, శీఘ్ర దర్శనము 50, విశిష్ట దర్శనము 200,అష్టోత్తర పూజ 20 రూపాయలుగా ఏర్పాటు చేయడమైనదన్నారు. దశావతారాల పురస్కరించుకొని ఈ నెల 21 నుండి 29 వరకు 9 రోజులు నిత్య పూజలలో పాల్గొను భక్తులు దేవస్థాన కార్యాలయములో రూ. 500 రూపాయలు చెల్లించి, వారి గోత్ర నామములతో ఆయా రోజులలో పూజ జరిపించి ప్రసాదములు వారికి అచ్చటనే ఇవ్వబడునని తెలిపారు. జగన్నాథ స్వామి ప్రసాదములు ప్రతిరోజు టర్నరు సత్రం ఆవరణ వద్ద విక్రయించబడునని తెలిపారు. స్వామివారి ప్రధాన దేవాలయంలో ప్రతి రోజూ భక్తుల ఉభయుల గోత్రనామములతో 150 రూపాయలు రుసుము చెల్లించి నట్లయితే తొలిపూజ చేయబడునన్నారు. సంవత్సర పూజకు 1500 రూపాయలు రుసుము చెల్లించి తగు రసీదు పొందవలెనని తెలిపారు.పూజ చేయించుకొను భక్తులకు ప్రతి నెల ఆఖరు శనివారం దేవాలయము లో ప్రసాదం ఇవ్వబడు నన్నారు. దశావతార అలంకరణలు చేయుదలచు భక్తులు ముందుగా కార్య నిర్వాహణాధికారి కార్యాలయములో సంప్రదించవలెనని, భక్తులు విరాళములు ఇచ్చి తగు రశీదు పొంద వలసినదిగా కోరారు. భక్తులెల్లరూ జగన్నాథ స్వామి కళ్యాణం, రథయాత్ర మహోత్సవములలో పాల్గొని స్వామిని దర్శించి శ్రీ జగన్నాథ స్వామి కృపకు పాత్రులు కావలసినదిగా కోరారు.



## ఉచిత హోమియో మెడికల్ క్యాంపు



భీమునిపట్నం : విజయభాను న్యూస్ : స్థానిక కలిగొట్ల స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 62 వ ఉచిత హోమియో మెడికల్ క్యాంపు లో 102మందికి పరీక్షలు నిర్వహించి ఉచితముగా హోమియో మందులు అందజేసామని ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామ్ తెలియజేసారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు టి జగన్నాధ రావు, టి జె మోహన్, ఫౌండేషన్ ప్రతినిధులు కే ఎస్ ఎన్ మూర్తి, కె చంద్ర శేఖర్, కే వి భానోజి రావు, కే.శ్రీనివాసరావు,మరియు ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## స్పందన కార్యక్రమంలో 4 అర్జీలు

భీమునిపట్నం, విజయభాను న్యూస్ జోన్-I ,జివిఎంసి జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంకు 4 అర్జీలు వచ్చినట్లు భీమిలి జోనల్ కమీషనర్ బి.రాము తెలిపారు. వీటిలోపట్టణ ప్రణాళిక విభాగంనకు- 1,ఇంజనీరింగ్ విభాగానికి - 1 , రెవెన్యూ విభాగానికి 2 వచ్చినట్లు చెప్పారు. తదుపరి చర్యలకు సంబంధిత శాఖాధిపతులకు పంపడం జరిగిందనీ ఆయన అన్నారు.

## మాజీ మంత్రి బండారుకు శుభాకాంక్షలు తెలిపిన టీడీపీ శ్రేణులు



పరవాడ (విజయభాను న్యూస్) : మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి పుట్టినరోజు సందర్భంగా పరవాడ గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.పైల రామచంద్రరావు (జిల్లా తెలుగుదేశం పార్టీ సాంస్కృతి విభాగం అధికార ప్రతినిధి) పైలా చిన అక్కు నాయుడు మండల తెలుగు యువత అధ్యక్షులు పైలా సన్యాసినాయుడు (పరవాడ గ్రామంతెలుగుదేశం పార్టీ అధ్యక్షులు), చుక్కా వెంకట్రావు, పైల సింహాచలం నాయుడు, ప్రసాద్, శ్రీధర్, నర్సింగ్, చిన్న మరియు తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. దీంట్లో భాగంగా మాజీ మంత్రివర్యులు బండారు సత్యనరాయణమూర్తి పుట్టిన రోజు సందర్భంగా తెలుగు నాడు రజక ఫెడరేషన్ ఆధ్వర్యంలో వాళ్ళ స్వగృహంకి వెళ్ళి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.. టి.ఎన్.ఆర్ఎఫ్. జిల్లా అధ్యక్షులు రుంకాన నూకరాజు ప్రధాన కార్యదర్శి అడ్డూరి శంకర్, ఉపాధ్యక్షులు పసుపులేటి గోవింద్, కోశాధికారి నేమర్తి కొండబాబు మఠం అచ్చిబాబు పాల్గొన్నారు...

# పవన్ నీవంటే గౌరవముంది.. అది కాపాడుకో...

## కాపు నాయకులు ఉద్బోధ

**కాకినాడ, విజయభాను న్యూస్ :** జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ అంటే ఇప్పటికీ మాకు గౌరవం ఉందని, చెప్పుడు మాటలు విని, మా నగర శాసనసభ్యుడు ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డిపై అనవసర ఆరోపణలు చేసి,దాన్ని పాడుచేసుకోవద్దని కాకినాడ నగర కాపు నాయకుల పవన్ కు హితవు చెప్పారు. స్థానిక డి కన్వెన్షన్ హాలులో జరిగిన సమావేశంలో వివిధ కాపు నాయకులు మాట్లాడారు. ఈ సంధర్భంగా నగర మాజీ మేయర్ సుంకర శివ ప్రసన్న మాట్లాడుతూ, ఈ జిల్లాలో జరిగిన ప్రతి జనసేన బహిరంగ సభలో నగర శాసనసభ్యులు ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డిపై ఆరోపణలు చేయడాన్ని ఖండించారు. పార్టీ జెండా, అజెండా లేని పార్టీ జనసేన అని, అటువంటి వారు చంద్రశేఖర్ రెడ్డిని విమర్శిస్తే మా నాయకుడ్ని కాపాడుకోవడానికి ఎంతవరకైనా అడ్డుపడతామని తెలిపారు. కూడా చైర్మన్ రాగిరేడ్డి చంద్రకళ దీప్తి మాట్లాడుతూ, వైయస్సార్ కాంగ్రెసు ముమ్మాటికి కాపులకు అండగా ఉంటోందని, ముఖ్యంగా చంద్రశేఖర్ రెడ్డి కాకినాడలో కాపులకు అండగా ఉండి, వివిధ కమీటీలలో పదవులు ఇచ్చారని స్పష్టం చేశారు. అలాగే కాపు కళ్యాణ మండపానికి70 లక్షల రూపాయలు మంజూరు చేసిన ఘనత చంద్రశేఖర్ రెడ్డి, యమ్ పి వంగా గీతకు చెందుతుందని తెలిపారు. అలాగే కాకినాడ నగరంలో వెయ్యి గజాల స్థలం మంజూరు చేసిన చంద్రశేఖర్ రెడ్డిపై పవన్ కళ్యాణ్ అవాకులు చవాకులు మాట్లాడటం మానుకోవాలని హితవు పలికారు. మరొక కాపు నాయకులు యన్ వి సాయి బాబు మాట్లాడుతూ, పవన్ కళ్యాణ్ కు చంద్రశేఖర్ రెడ్డి ఫోబియో పట్టుకుని, కలలో కూడా చంద్రశేఖర్ రెడ్డి పేరు కలవరిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా సాయి మాట్లాడుతూ, తెలుగు దేశం హయాంలో అనేక అవమానాలకు గురైన సాటి కులస్తుడు. ముద్రగడ పద్మనాభాన్ని కనీసం పరామర్శ చేయలేని మహా సంస్కారి పవన్ కల్యాణ్ అని మండిపడ్డారు. ఓ ముఖ్యమంత్రి అభ్యర్థి అయిన నీవు ముందు నీ బాష మార్చుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో కాపు నాయకులు దుగ్గిన నాగరాజు, ఇనుకొండ పట్టాభిరామయ్య, పుప్పాల చిన్న,ముమ్మిడి గోవింద్ బెండా విష్ణుమూర్తి, కృష్ణ ప్రియ,రాజారపు కృష్ణ, దవులూరి రామకృష్ణ, పసుపులేటి చంద్రశేఖర్, జేడీ పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## నేడు రథయాత్ర

రాజాం (విజయభాను న్యూస్) : మంగళవారం ఉదయం 9.00 గం.లకు పట్టణంలో శివం మందిరం లో జగన్నాథ స్వామి రథయాత్ర ప్రారంభం కానుందని సత్యసాయి భక్తులు వెల్లడించారు. పట్టణ వాసులు ఈ యాత్ర లో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందాలని కోరారు.

## స్టిల్ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గా సతీష్



సతీష్ ని సన్మానిస్తున్న దృశ్యం

రాజాం (విజయభాను న్యూస్) : స్టిల్ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అఫ్ తెలుగు టెలివిజన్ నూతన కార్య వర్గ ప్రమాణ స్వీకారం హైదరాబాద్ ఫిల్మ్ నగర్, ఫిల్మ్ చాంబర్లో ఘణంగా నిర్వహించారు. తెలుగు టెలివిజన్ అండ్ డిజిటల్ మీడియా టెక్నీషియన్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ పర్యవేక్షణలో లీగల్ అడ్వైజర్, ఎలక్షన్ ఆఫీసర్ కె.వి.ఎల్. నరసిం హారావు ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు జరిగాయి. ఈ అసోసియేషన్ లో సుమారు ఇరవై సంవత్సరాలుగా కెవై గిరిరాజు అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఇదిలా ఉండగా మచిలీపట్నం కి చెందిన చిలంకుర్తి నాగభూషణం (శేషు) ఉపాధ్యక్షులుగా, రాజాం కి చెందిన సుంకరపల్లి సతీష్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గా ఎన్నిక కావడం విశేషం, పి.శ్యాంబాబు,శేషు, స్వామి,లాభాన శ్రీనివాసరావు కార్యనిర్వాహక సభ్యులు గా ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఫిల్మ్ ఫెడరేషన్ పెద్దలు, తెలుగు సినిమా ప్రొడ్యూసర్ కౌన్సిల్ ప్రతినిధులు కెయల్ దామోదర ప్రసాద్, తుమ్మల ప్రసన్న కుమార్ సతీష్ ని ఈసందర్భంగా సత్కరించారు.ఈ కార్యవర్గంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ హోదా ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా కి దక్కడం ఇదే తొలిసారి. గతంలో ఈ కార్యవర్గంలో ప్రతినిధులుగా ఇక్కడి వారు ప్రాతినిధ్యం వహించకపోవడం వలన కీలక స్థానాలలో ఎవరూ బాధ్యతలు నిర్వహించలేదు. అటువంటి అరుదైన అవకాశం సుంకరపల్లి సతీష్ కి దక్కింది. ఆంధ్రప్రదేశ్ ఫోటో, వీడియోగ్రాఫర్ల సంక్షేమ సంఘం లో కూడా ఆయన ఆర్గనైజింగ్ సెక్రటరీ గా కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇప్పుడు తెలంగాణ రాష్ట్రానికి చెందిన సంఘం లో ఆర్గనైజింగ్ సెక్రటరీ గా బాధ్యతలు నిర్వహించే అవకాశం సతీష్ కి దక్కడంతో జిల్లా ఫోటోగ్రాఫర్స్, మిత్రులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తన స్వగ్రామం గలావిల్లి లో సామాజిక సేవా దృక్పథంతో పలు సేవలందించడమే కాక సమాజానికి సేవ చేసే జర్నలిస్టు గా కూడా దశాబ్ది కాలంగా పేరు తెచ్చుకున్న సతీష్ ని పలువురు జర్నలిస్టులు, ఫిల్మ్ మేకర్, తృప్తి రిసార్ట్స్ అధినేత మురళి మాస్టర్ ఈ సందర్భంగా అభినందించారు.

## పుదుచ్చేరిలో ఘనంగా రాహుల్ గాంధీ పుట్టిన రోజు వేడుకలు

### పాల్గొన్న ఎంపీ వైద్య లింగం, మాజీ ముఖ్యమంత్రి నారాయణస్వామి, ఇతర ప్రముఖులు

యానాం, విజయ భాను న్యూస్ : కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరి నియోజకవర్గం అంతట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాహుల్ గాంధీ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్ లో ఏర్పాటుచేసిన రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు పురస్కరించుకొని భారీ ఎత్తున సభ నిర్వహించారు. అనంతరం రాహుల్ గాంధీ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ భారీ కేకును కట్ చేశారు. అనంతరం కార్యకర్తలకు మిఠాయిలు పంచి పెట్టి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎంపీ( ప్రస్తుతం పిసిసి అధ్యక్షుడు వైద్య లింగం) మాజీ ముఖ్యమంత్రి నారాయణస్వామి, మాజీ పీసీసీ అధ్యక్షుడు ఏవి సుబ్రహ్మణ్యం, మాజీ మంత్రి కందసామి, ఇతర మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, బీసీ సేన ప్రధాన కార్యదర్శి మల్లాడిసత్తిబాబు, కాంగ్రెస్ నాయకులు దున్న చక్రవర్తి ,వివిధ నియోజకవర్గాలకు సంబంధించి కాంగ్రెస్ సీనియర్ లీడర్లు, యూత్ లీడర్లు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు పాల్గొన్నారు.



## ఉగాది పచ్చడిలో రుచులన్ని నాకు తెలుసు

కాకినాడ (విజయభాను న్యూస్) రాజకీయ ఉగాది పచ్చడిలో రుచులన్ని నాకు తెలుసని తెలియచేస్తూ, తన రాజకీయ జీవితం తెరచిన పుస్తకం అని కాకినాడ నగర శాసనసభ్యులు ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి స్పష్టం చేశారు. స్థానిక డి కన్వెన్షన్ హాలులో విలేకరులతో మాట్లాడుతూ, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ కాకినాడ జిల్లా పర్యటనలో కత్తిపూడిలో, పిఠాపురం లో తనపై చేసిన ఆరోపణలకు బదులిస్తూ, తాను కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పైకొచ్చి రెండు సార్లు శాసనసభ్యుడిని అయిన విషయం గుర్తు చేసారు. నన్ను నమ్మిన ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటానని స్పష్టం చేస్తూ, నా మీద జనసేన అధ్యక్షుడు, నాయ కులు చేస్తున్న ఆరోపణలు నిజమైనవి అయితే ఖండించనని, అలాకాకుండా లేనిపోని నిందలు వేస్తే తగ్గేది లేదని, దాని కోసం ఎంతవరకైనా పోరాడుతానని స్పష్టం చేశారు.

# రావులమ్మ పాలెంలో పిడుగు పడి 18 మేకలు మృతి

**– స్పృహ కోల్పోయిన మరో ఏడు మేకలు**

**– బాధిత కుటుంబాన్ని పరామర్శించిన వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద, స్థానిక సర్పంచ్**



సబ్బవరం (విజయభాను న్యూస్): అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం అంతకాపల్లి పంచాయతీ పరిధిలోని రావలమ్మ పాలెంలో సోమవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షం, తో పాటు పిడుగు పడి సజ్జి రమణ అనే వ్యక్తికి చెందిన 18 మేకలు అక్కడకక్కడే మృతిచెంద గా మరో 7 మేకలు స్పృహతప్పి పడిపోయాయి. విషయం తెలుసుకున్నా సబ్బవరం వైస్ ఎంపీపీ చొక్కాలు గోవింద, స్థానిక సర్పంచ్ నారాయణమూర్తి సంబంధిత అధికారులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కే కోటపాడు మండలం గుల్లి పల్లికి చెందిన సజ్జి రమణ మేకల మందను కాస్తూ ప్రధాన వృత్తి గా జీవిస్తున్నాడని, తన ముగ్గురు ఆడపిల్లలను ఈ మేకల పోషణ ద్వారానే పోషిస్తున్నాడని వివరించారు.

ఇక్కడి బీసీ బాలుర హాస్టల్ పక్కనే కమ్మలపాకలో ఈ మేకలను కట్టి ఉంచడంతో సోమవారం తెల్లవారుజామున కురిసిన జోరు వర్షంలో చలి పిడుగు పడిందని, దాని దాటికి 18 మేకలు అక్కడికక్కడే చనిపోగా మరో ఏడు మేకలు స్పృహ తప్పి పడిపోయే అన్నారు.

నిరుపేద కుటుంబానికి చెందిన సజ్జి.రమణ కు ప్రభుత్వం సహాయపడాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమాచారాన్ని మండల పశువుల ఆసుపత్రి వైద్యులు డాక్టర్ అరుణకు సమాచారం పంపించినట్లు పేర్కొన్నారు.

అదే సమయంలో పశువుల ఆస్పత్రి వైద్యులు డాక్టర్ అరుణను మీడియా ప్రతినిధులు కలిసి వివరాలు అడిగినప్పుడు ఆమె స్పందిస్తూ సాధారణంగా మేకలు గొర్రెలు పెంపకం దారులు ఇన్సూరెన్స్ ప్రీమియం కట్టి పేర్లు నమోదు చేసుకుంటే ప్రమాదాలు జరిగినప్పుడు తెల్ల రేషన్ కార్డు ఉన్న లబ్ధిదారులకు 80 శాతం , మిగిలిన లబ్ధిదారులకు 50 శాతం చొప్పున మార్కెట్ విలువ కట్టి నష్టపరిహారం చెల్లించడం జరుగుతుంది అన్నారు.చనిపోయిన 18 మేకల విలువ సుమారు రెండు లక్షల రూపాయలు ఉంటుందని ఆమె ఒక ప్రశ్నకు జవాబుగా తెలిపారు. మిగిలిన మేకలు స్పృహ కోల్పోయాయని వాటికి వైద్యం అందిస్తున్నామని పేర్కొన్నారు. మేకలకు ఇన్సూరెన్స్ చేయించలేదని, ప్రకృతి వైపరీత్యాల నివారణ సంస్థ ద్వారా సహాయానికి ప్రభుత్వానికి సమాచారం ఇస్తామని పేర్కొన్నారు.

సజ్జ రమణ కుటుంబాన్ని వైస్ ఎం.పి.పి చొక్కాకుల గోవిందు, పరామర్శించారు. నిరుపేద గొర్రెలు మేకల పెంపకం దారులను పిడుగుపాటు లాంటి వైపరీత్యాలు సంబంధించినప్పుడు ప్రభుత్వం వెంటనే స్పందించి సహాయ పడాలని మండల యాదవ సంఘం తరపున పల్ల. తాతారావు, జిల్లా సంఘం అధ్యక్షులు బర్నికాన. సాయి నాధ రావులు డిమాండ్ చేశారు.

# సుదీర్ఘ సమస్యలు పరిష్కారానికి చర్యలు

**– జీవీఎంసీ అధికారులతో మంత్రి సమీక్ష – అనకాపల్లి పట్టణ సుందరీకరణకు నడుం బిగించిన మంత్రి అమర్నాథ్**





విశాఖపట్నం/అనకాపల్లి(విజయభాను న్యూస్) : అనకాపల్లి పట్టణ సుందరకరణతో పాటు, సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న అనేక సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ నడుం బిగించారు. జివిఎంసి కమిషనర్ సాయి కాంత్ వర్మ , మంత్రి అమర్నాథ్ అనకాపల్లికి చెందిన జీవీఎంసీ అధికారులతో స్థానిక సర్క్యూట్ హౌస్ లో సోమవారం సమీక్ష నిర్వహించారు. విలీన గ్రామాలకు అమృత పథకం కింద కేటాయించిన పథకం మంచినీటి పథకాన్ని ఇప్పటికే రైల్వే, ఎన్ హెచ్ ఫైవ్ నుంచి అనుమతులు లభించినందున పనులు వేగవంతం చేయాలని మంత్రి అమర్నాథ్ అధికారులు ఆదేశించారు.

జలగలమధుము వద్ద నుండి నుంచి అనకాపల్లి పట్టణంలోకి వెళ్లే రహదారిని సుందరీకరించాలని మంత్రి అమర్నాథ్ అధికారులను ఆదేశించారు. ఈ రోడ్డుకు ఇరువైపులా కాలువలను నిర్మించాలని, రోడ్డు మధ్య డివైడర్లను, సెంట్రల్ లైటింగ్ ను ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. అదేవిధంగా పెరుగు బజారు రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలని, ఇప్పటికే 998 మంది విస్తరణకు అనుకూలంగా స్పందించడం వల్ల ఆయా కట్టడాలను వెంటనే తొలగించాలని మంత్రి సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే అనకాపల్లి పట్టణానికి మంజూరైన పైపులైను నిర్మాణ విషయమై అధికారులను అమర్నాథ్ ప్రశ్నించగా ఈ ఏడాది అక్టోబర్ 31వ తేదీ నాటికి ఈ పనులు పూర్తి చేస్తామని బదులిచ్చారు. అలాగే హైవే నుంచి వల్లూరు రోడ్డు అభివృద్ధి పనులను సత్వరం చేపట్టాలని సూచించారు.

ఇదిలా ఉండగా అనకాపల్లి పట్టణానికి 32 హైమాక్స్ పోల్స్ మంజూరు చేశారని, కానీ వాటికి విద్యుత్ దీపాలను అమర్చకపోవడం పట్ల మంత్రి అమర్నాథ్ అసహనం వ్యక్తం చేశారు. దీనికి సంబంధించిన అధికారులు వివరణ ఇస్తున్న సమయంలోమున్సిపల్ కమిషనర్ సాయి కాంత్ వర్మ జోక్యం చేసుకుని లైట్లు సంబంధించి ప్రత్యేక టెండర్లు పిలవాలని, అందుకు అవసరమైన 20 లక్షల రూపాయలు నిధులను తాను మంజూరు చేస్తానని చెప్పారు. చాలా కాలంగా అపరిష్కృతంగా ఉన్న విలీన

గ్రామాల్లోని కొప్పాక వద్ద మురుగునీటి సమస్యపై మంత్రి అమర్నాథ్ ప్రత్యేక దృష్టి సారించి, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. దీనిపై సంబంధిత అధికారులు మాట్లాడుతూ మురుగునీరు పోయేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేస్తామని చెప్పారు. అలాగే విలీన గ్రామమైన రాజుపాలెం సూర్యనారాయణ స్వామి ఆలయం వద్ద వర్షాకాలంలో వర్షపు నీరు నిలిచిపోతోందని దీనివల్ల భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అమర్నాథ్ అధికారులు దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే ప్రాంతంలో సిద్ధం వర్షపు నీటి కాలువను నిర్మించి ఈ సమస్యని పరిష్కరించాలని అమర్నాథ్ అధికారులకు సూచించారు. అదేవిధంగా నూకాలమ్మ ఆలయం ఆర్చి నుంచి పూడిమడక వెళ్లే రహదారిని విస్తరించడానికి ఇప్పటికే ప్రతి పాదనలు సిద్ధం చేశామని అందుకు అధికారులు మార్గాన్ని సుగమం చేయాలని అమర్నాథ్ విజ్ఞప్తి చేశారు. అనకాపల్లిలో గ్యాస్ ఆధారిత బరియల్ గ్రౌండ్ పనులు పూర్తికాలేదన్న విషయాన్ని మంత్రిపూర్తి కాలేదు అమర్నాథ్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. పెండింగ్ పనులు పూర్తి చేయడానికి మళ్లీ టెండర్లు పిలవాలని కమీషనర్ వర్మ అధికారులకు సూచించారు. అలాగే పట్టణంలోని అన్నమయ్య, శాంతి పార్కు నిర్వహణ సరిగా లేదని, దీనిపై సంబంధిత అధికారులు స్థానికుల సహకారం తీసుకుని పార్కులను సుందరంగా తీర్చిదిద్దాలని కోరారు. అనకాపల్లి పట్టణానికి సంబంధించిన డంపింగ్ యార్డ్ అంశంపై మంత్రి మాట్లాడుతూ యార్డును వేరేచోట ఏర్పాటు చేయాలని సూచించారు. అనకాపల్లి నుంచి పెందుర్తి వెళ్లే మార్గంలో ఎక్కడైనా డీ పట్టా భూమి లభ్యమైతే దానిని తీసుకొని అక్కడ గార్బేజ్ లిఫ్టింగ్ స్టేషనునెలకొల్పాలని ఆదేశించారు. 82వ వార్డులోని రజక సామాజిక భవనం, శ్రీరామ్ నగర్ లోని ఎస్సీ కమ్యూనిటీ హాలు టెండర్ ప్రక్రియను పూర్తి చేసి నిర్మాణ పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు.

### సిబ్బంది తీరుపై మంత్రి అసహనం

అనకాపల్లి మున్సిపల్ కార్యాలయంలో పనిచేసేందుకు వచ్చే సిబ్బంది పూర్తిగా మనసుపెట్టి పనిచేయడం లేదనికొద్ది సమయం మాత్రమే కార్యాలయంలో ఉంటున్నారని మంత్రి అమర్నాథ్ అసహనం వ్యక్తం చేశారు. గతంలో అనకాపల్లి, విశాఖపట్నంలో కలిసి ఉండేది. కానీ ఇది ఇప్పుడు జిల్లా కేంద్రమైంది. పట్టణంలో సమస్యలు కూడా పెరుగుతున్నాయి. ఇటువంటిప్పుడు సిబ్బంది పూర్తిస్థాయిలో అనకాపల్లి కార్యాలయంలో ఉండి సమస్యలు పరిష్కరించవలసిన అవసరం ఉంది. ఇందుకు తగ్గట్టుగా చర్యలు తీసుకోవాలని కమిషనర్ వర్మను మంత్రి అమర్నాథ్ కోరారు. ఉత్సాహంగా పనిచేసేవారిని అనకాపల్లి కార్యాలయం పంపించాలని మంత్రి అమర్నాథ్ కమిషనర్ కు విజ్ఞప్తి చేశారు.

# పూరీ జగన్నాథుడు

పల్లవి:
ఉత్కళమున వెలసినట్టి పూరీ జగన్నాథుడు
సంద్ర తీరమున సుభద్ర బలరామ సహితుడు
అలనాటి గిరిజనుల దేవుడీ మాధవుడు
కృష్ణ భక్తులకెంతో ప్రీతిపాత్ర జగన్నాథుడు

చరణం 1:

దారుశిల్పముల మూలవిరాట్టులద్భుతము
దేవాలయ శిఖరముపై శ్రీ చక్ర సోయగము
ఎత్తైన రాతిపై ధ్వజస్తంభ నిర్మితము
పదహారు ముఖ ఏకశిలా అరుణ స్తంభము

చరణం 2:

శతద్వాదశ గుడులున్న విశాలమౌ ప్రాంగణము
ఆది శంకర స్థాపిత గోవర్ధన మఠము
అమోఘ శిల్పసంపదతో రాజకట్టడము
సింహద్వారమున ఈ దేవాలయ ప్రవేశము

చరణం 3:

మహాలక్ష్మి పర్యవేక్షించు స్వామి నైవేద్యము
గంగ యమున బావుల జలముల వినియోగము
యాబది ఆరు రకముల నైవేద్య నివేదనము
ఆనందబజారు పంచు జగన్నాథ ప్రసాదము

చరణం 4:

ముక్తి డోల మండపముల శిలా తోరణము
భోగ మండపంబునందు ప్రతిమల సముదాయము
చతుర్ధామములలో ముఖ్య దేవాలయము
చతుర్దశ భువన వీక్షకుడుండే శ్రీ క్షేత్రము

చరణం 5:

పూరీ జగన్నాథుని రథయాత్ర అపూర్వము
యావద్భారతదేశము నందిది సుప్రసిద్ధము
నాలుగు వేల భక్తులు లాగేటి కొత్త రథము
జగన్నాథ నామముతో దద్దరిల్లు క్షేత్రము

చరణం 6:

వాయు వ్యతిరేక దిశనెగురు గోపురధ్వజము
ఇరవై అడుగులు ఉండే శిఖర సుదర్శనచక్రము
నలుబదైదు అంతస్తున నిత్య మార్పు కేతనము
గుడినుపరితలమునుండి ఎగురదే విహంగము



రచన:
**శ్రీ పల్లి నల్లనయ్య**

# ప్రజల సమస్యలు పరిష్కరించే దిశగా గ్రీవెన్స్ నిర్వహించిన కె.కె రాజు



సీతమ్మధార (విజయభాను న్యూస్): విశాఖ ఉత్తర నియోజకవర్గంలో ప్రజల సమస్యలు పరిష్కరించే దిశగా విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త,రాష్ట్ర నెడ్ క్యాప్ చైర్మన్ కె కె రాజు సోమవారం విశాఖ ఉత్తర నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గం నుండి పలువురు కార్యాలయంకు విచ్చేసి తమ సమస్యలను కె కె రాజు కి స్వయంగా వచ్చి విన్నవించారు. వారి వద్ద నుండి సంబంధిత వినతి పత్రాలు, దరఖాస్తులు తీసుకుని అధికారులతో మాట్లాడి కొన్ని వెంటనేపరిష్కరించారు. మరికొన్ని సంబంధిత అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

# సమిష్టి కృషిగా సమన్వయంతో పనిచేయండి

– సీఎం జగన్ ను మర్యాదపూర్వకంగా కలిసిన మచిలీపట్నం పోర్ట్ నూతన ఎం.డి మేకతోటి దయాసాగర్



తాడేపల్లి(విజయభాను న్యూస్) : తాడేపల్లి సిఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించిన మచిలీపట్నం పోర్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ నూతన ఎం.డి దయాసాగర్. సీఎం జగన్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మచిలీపట్నం పోర్ట్, పారిశ్రామిక రంగానికి మౌలిక సదుపాయాలు కల్పించి రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషించనుంది. తనపై నమ్మకంతో అలాంటి ప్రాజెక్ట్ కి మేనేజింగ్ డైరెక్టర్ గా నియమించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. అందరినీ కలుపుకొని సమిష్టి కృషితో ప్రభుత్వ అంచనాలకు అనుగుణంగా పని చేయాలని కోరి శుభాకాంక్షలు తెల్పిన ముఖ్యమంత్రి జగన్ .

## సైకిల్ పై కార్యాలయానికి చేరుకున్న జివిఎంసి కమిషనర్



విశాఖపట్నం, (విజయభాను న్యూస్) : పర్యావరణ పరిరక్షణ నిమిత్తం జివిఎంసి కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ సోమవారం సైకిల్ తొక్కి అందరికీ ఆదర్శంగా నిలిచారు. కాలుష్య నియంత్రణకు కనీసం వారానికి ఒకరోజైనా నగర ప్రజలు తమ సొంత వాహనాలు వదిలేసి ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగించుకోవాలని ఈ సందర్భంగా ఆయన ఓ ప్రకటనలో కోరారు. నగర మేయర్, జివిఎంసి సిబ్బంది ప్రతి సోమవారం ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగిస్తున్నారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం ఉదయం తన బంగ్లా నుంచి జివిఎంసి కార్యాలయానికి సైకిల్‌పై ప్రయాణించారు. జగనన్నకు చెబుదాం వంటి కార్యక్రమాల అనంతరం కూడా సైకిల్‌పైనే తిరిగి వెళ్లారు.

## జిల్లా కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎయిర్ పోర్ట్ నూతన డైరెక్టర్ ఎస్. రాజారెడ్డి

ఎయిర్ పోర్ట్ డైరెక్టర్ గా భాధ్యతలు స్వీకరించిన ఎస్.రాజా రెడ్డి



విశాఖపట్నం **(విజయభాను న్యూస్) :** విశాఖపట్నం ఎయిర్ పోర్ట్ డైరెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన రాజారెడ్డి సోమవారం మధ్యాహ్నం విఎంఆర్డిఎ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ డా.ఎ మల్లిఖార్జునను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నూతన ఎయిర్ పోర్ట్ డైరెక్టర్ ఎస్.రాజా రెడ్డి కి శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ విస్తీర్ణ పరంగా విశాఖ జిల్లా చిన్నదైనా ఆర్థిక పరంగా రాష్ట్రంలో ముందుందని అన్నారు . ప్రతిరోజూ విశాఖ నుండి జాతీయంగా, అంతర్జాతీయంగా పలు విమాన రాకపోకలు నిర్వహిస్తుందని అన్నారు. అంకితభావంతో పని చేసి టూరిస్టులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా విశాఖ ఎయిర్ పోర్ట్ కు మంచి పేరు తీసుకురావాలని ఎయిర్ పోర్ట్ డైరెక్టర్ కు కలెక్టర్ సూచించారు. జిల్లా యంత్రాంగం తరపున ఎయిర్ పోర్ట్ అభివృద్ధికి అన్ని విధాలుగా సహకారం అందిస్తామని అన్నారు.

# కాల పరిమితి లోగా అర్జీలను పరిష్కరించాలి

– రీఓపెన్ అర్జీలపై ప్రత్యేక. దృష్టి సారించండి. –జిల్లా కలెక్టర్ డా ఏ మల్లికార్జున.



విశాఖపట్నం, (విజయభాను న్యూస్) : కాల పరిమితిలోగా ప్రజల నుండి వచ్చు అర్జీలు పరిష్కరించాలని జిల్లాల కలెక్టర్ డా',, ఎ మల్లికార్జున అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఆయన పాల్గొని జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ మల్లికార్జున మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం వెబ్ సైట్ లో నమోదైన అర్జీలను తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టరు చెప్పారు. పోర్టల్లో వచ్చిన అర్జీలను గడువులోగా పరిష్కరించాలన్నారు. జగనన్నకు చెబుదాం పై నిర్లిప్తంగా ఉండరాదని, అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలన్నారు. అర్జీదారులకు ఇబ్బందులు కలిగించరాదని ఆయన సూచించారు. అధికారులు బాధ్యతగా పని చేయాలని,జగనన్నకు చెబుదాం పోర్టల్లో అర్జీలు పునరావృతం గాకుండా చూడాలన్నారు. ప్రతి అర్జీని సంబంధిత శాఖల అధికారులు తక్షణమే పరిశీలించి వాటికి పరిష్కార మార్గం చూపాలని ఆయన ఆదేశించారు. ఎస్ ఎల్ ఎ పీరియడ్ అవ్వకముందే పిటిషన్ దారునితో మాట్లాడి వారికి వివరాలు తెలియజేసి పరిష్కరించాలన్నారు. ఎండార్స్ మెంట్ చేసేటప్పుడు అధికారులు దానిని నిర్ధారించి చేయాలన్నారు.

అర్జీదారునికి ఇచ్చే సమాధానం పూర్తి వివరాలుతో ఉండాలని, అసంపూర్తిగా లేకుండా చూడాలన్నారు. అధికారులు తమకు అందిన దరఖాస్తులను పూర్తిగా చదివి, ఒకవేళ అది తమ శాఖకు సంబంధించింది కానట్లయితే దానిని సంబంధిత అధికారులకు పంపాలని సూచించారు.

ఎండార్స్ మెంట్ ఇచ్చేటప్పుడు ఫోటో తప్పనిసరిగా పోర్టల్ లో అప్లోడ్ చేయాలన్నారు. గడువు తీరినప్పటికి వివిధ శాఖలలో అర్జీలు పెండింగ్ లో ఉండడంపై ఆయన ఆరా తీశారు. సోమవారం జగనన్నకి చెబుదాం కార్యక్రమంలో 210 విజ్ఞప్తులుఅందాయి.

ఈకార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కే ఎస్ విశ్వనాథన్, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఐసిడిఎస్ మానిటరింగ్ కమిటీ సమీక్ష సమావేశం

విశాఖపట్నం (విజయభాను న్యూస్) : సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి ఐసిడిఎస్ మానిటరింగ్ కమిటీ సమీక్ష సమావేశం జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రంలో పిల్లలకు, బాలింతలకు ఇచ్చే నిత్యవసర వస్తువులు బియ్యం, కందిపప్పు, నూనె, వైఎస్ఆర్ కిట్స్ ఎటువంటి ఆటంకాలు లేకుండా ప్రతినెలా సరఫరా చేయాలని పౌర సరఫరాల అధికారులకు ఆదేశించారు. ఎస్ డి జి ఇండికేటర్స్, బాలింతలో రక్తహీనత, బరువు తక్కువగా ఉన్న పిల్లలు ఆయా వివరాలు అంగన్వాడి సూపర్వైజర్లను అడిగి తెలుసు



కున్నారు మళ్లీ వచ్చే సమావేశం నాటికి పూర్తి వివరాలు తీసుకురావాలని అంగన్వాడీ సూపర్వైజర్లను ఆదేశించారు.

నాడు నేడు పనుల్లో భాగంగా అంగన్వాడి కేంద్రాల్లో పనులు పురోగతిని అడిగి తెలుసు కున్నారు. అంగన్వాడీ సూపర్వైజర్లు పిల్లలు, బాలింతలపై ప్రత్యేక శ్రద్ధ వహించా లని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పిడి డి.వెంకటేశ్వరి, జిల్లా వైద్యాధికారి జగదీశ్వర రావు, సిడిపిఓలు ఎం.వి రమణ కుమారి,డి నీలమణి, ఎం శ్రీదేవి, ఎల్ సుజాత, అంగన్వాడీ సూపర్వైజర్లు పాల్గొన్నారు.

# 48వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



కంచరపాలెం (విజయభాను న్యూస్): గ్రేటర్ విశాఖ పరిధిలో గల 48వ వార్డు న్యూ శ్రీనివాసనగర్,శివలింగపురం, ప్రాంతాల్లో రిటైనింగ్ వాల్,సీసీ రోడ్లు,మెట్లు,డ్రైన్లు నిర్మాణంకు సంబం ధించి 48వార్డులో 1కోటి 7లక్షల 70వేలు రూపాయల వ్యయంతో కూడుకున్న పనులకు సోమవారం 48వ వార్డు కార్పొరేటర్,జీవీఎంసీ భారతీయ జనతా పార్టీ ఫ్లోర్ లీడర్ గంకల కవిత అప్పారావు ఆధ్వర్యంలో ఉత్తర నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త కేకే రాజు చేతులమీదుగా శంకుస్థాపన చేశారు. శ్రీనివాసనగర్,శివలింగపురం,ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు రిటైనింగ్ వాల్,సీసీ రోడ్లు,మెట్లు,డ్రైన్లు ఏర్పాటు చేస్తే కొండ వాలు ప్రాంతపు ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఉంటుందని కోరగా వెంటనే సంబంధిత నగర మేయర్ కు పలు మార్లు వినతి పత్రం అందజేసి నిధులు మంజూరు చేయించడం జరిగిందని ఆ పనులకు గాను శంకుస్థాపన పనులు చేయడం జరిగిందని అన్నారు. ఈ రిటైనింగ్ వాల్,సీసీ రోడ్లు,మెట్లు,డ్రైన్లు పనులు వలన కొన్ని వేల కుటుంబాలకు ఎంతగానో ఉపయోగం వాట్టిలుతుందని వీటి వలన వాహదారులకు,పాదాచారులకు ఎంతో ఉపయోగకరమని గంకల అన్నారు. వార్డ్ అభివృదే ద్యేయంగా ముందుకు సాగుతున్నామని అన్నారు. ఇందులో భాగంగా అభివృద్ధి పనులలో నాణ్యత లోపించకూడదని,ప్రజల సొమ్ముతో చేస్తున్న అభివృద్ధి పనులను గ్రామస్తులకు ఇబ్బంది కలుగకుండా పారందర్శకంగా ఉండాలని,ప్రజలకు అంతరాయం లేకుండా పనులు చేపట్టాలని,వార్డ్ ప్రజలకు ఎటువంటి సమస్య ఏర్పడిన తక్షణమే గుడ్ మార్నింగ్ గంకల కార్యక్రమంలో సంప్రదించాలని అన్నారు.

ఈ సందర్బంగా అడిగిన వెంటనే మహిళా కార్పొరేటర్ అయినప్పటికి అభివృద్ధి పనుల పట్ల కౌన్సిల్ లో చర్చించి వార్డ్ కు అభివృద్ధి నిధులు తెప్పిస్తున్న గంకల కవిత అప్పారావు పట్ల వార్డ్ ప్రజలు అభిమానం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి,వార్డ్ అధ్యక్షుడు నీలి రవి, సతీష్, డిఈ భరణి కుమార్,ఏఈ అర్చన,48వార్డు ప్రజలు, సచివాలయం సిబ్బంది,వాలంటరీలు తదితరులు పాల్గొన్నారు.



VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS .,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com